DD9 వార్త
తెలుగు దినపత్రిక
గురువారం, జనవరి 15, 2026

## మినీ మేడారం జాతర
# ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలం తోగూడెం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించనున్న మినీ మేడారం (సమ్మక్క –సారలమ్మ జాతర) కార్యక్రమం సందర్భంగా అమ్మవారు వన ప్రాంతం నుండి గ్రామానికి వచ్చే పవిత్ర మార్గాన్ని స్వయంగా అడవి మార్గంలో వెళ్లి పర్యవేక్షించారు.

అడవి మార్గంలో అమ్మవారు వచ్చే మార్గాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పాయం

12 లో





## అంగరంగ వైభవంగా
# గుడిమెలిగే పండుగ

- మేడారం మహాజాతర ప్రధాన ఘట్టానికి శ్రీకారం
- డోలు వాయిద్యాలతో సమ్మక్క పూజారి గుడికి
- సమ్మక్క గుడి శుద్ధి – మంచినీటితో పవిత్రీకరణ
- అడవిలోని పుట్టమట్టి గుడిలో పోసిన పూజారులు
- ఎర్రమట్టితో అమ్మవారి గద్దె వద్ద ముగ్గులు
- మహిళలతో శోభిల్లిన సమ్మక్క గుడి ఆవరణ
- సమ్మక్క దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు

9 లో

మేడారం మహాజాతర సమీపిస్తున్న వేళ, పూజారులు పూజా కార్యక్రమాలకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో బుధవారం మేడారంలోని సమ్మక్క గుడిమెలిగే పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా సమ్మక్క గుడిని మంచినీటితో శుద్ధి చేసి, దేవతా సామగ్రిని పరిశుభ్రం చేశారు. అనంతరం అడవిలోని పుట్టమట్టిని గ్రామ పెద్దలు, పూజారులు తీసుకువచ్చి గుడిలో పోశారు. మహిళలు ఆ ఎర్రమట్టితో అమ్మవారి గద్దె వద్ద అందమైన ముగ్గులు వేసి గుడి ఆవరణను అలంకరించారు. సమ్మక్క ప్రధాన పూజారి ఇంటి నుంచి డోలు, వాయిద్యాల మధ్య ఊరేగింపుగా గుడికి చేరుకున్నారు. అనంతరం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవతకు మొక్కులు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

- ఏటూరునాగారం క్రైం, (డిడి9 వార్త)

# అంత్య పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ

6 లో



మహాదేవపూర్ జనవరి 14 ( డిడి 9 వార్త ): దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరం లో మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న సరస్వతి అంత్యపుష్కరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం కాళేశ్వరం దేవాలయ ఈఓ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, ఆర్కిటెక్చర్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి అంత్యపుష్కరాల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.



3 లో

## నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలి

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు

## భోగి మంటల్లో కాంగ్రెస్ 420 హామీలు

- మోసపూరిత పాలనకు చరమగీతం పాడాలి
- మాజీ ఎమ్మెల్యే చందర్

11 లో

## భోగి–సంక్రాంతి
# పండుగ శోభ

మంథని, జనవరి 14 (డిడి 9 వార్త): భోగి–సంక్రాంతి పండుగలు మంథనిలో ఆనందం, ఆధ్యాత్మికత, సంప్రదాయాల నడుమ ఘనంగా కొనసాగుతున్నాయి. గ్రామాలు, పట్టణాలు అన్నీ పండుగ వాతావరణంతో కళకళలాడుతున్నాయి. ప్రతి ఇంట్లో భోగి మంటలు, ముగ్గుల అలంకరణలు, పూజలు, కుటుంబ సమేతంగా పండుగ వేడుకలు జరుపుకుంటూ ప్రజలు సంబరాల్లో మునిగిపోయారు.

8 లో



# చిన్నారులకు భోగిపళ్ల వేడుక

- **ఆశీర్వచనాలు అందజేసిన పెద్దలు**

**మణుగూరు. జనవరి 14 (డి డి 9వార్త) :** భోగి రోజు సాయంత్రం చిన్నారుల తలపై రేగు పళ్లను పోయడం వల్ల వారిపై ఉన్న 'దృష్టి' (దిష్టి) తొలగిపోతుందని, బాలారిష్టాల నుంచి విముక్తి కలుగుతుందని పండితులు చెబుతుంటారు. అలాగే రేగు పండు సూర్యుడికి ఇష్టమైనది కావడం వల్ల, సూర్య భగవానుడి ఆశీస్సులు కూడా పిల్లలకు లభిస్తాయని నమ్మకం. భద్రాద్రి జిల్లా, మణుగూరు మండలం లోని కూనవరం గ్రామంలో డి డి 9వార్త మణుగూరు మండల రిపోర్టర్ దామోదర్ మనవరాలు చిరంజీవి మహాశ్రీ కు,మనవడు చిరంజీవి కార్తికేయ కు భోగి పండుగ సందర్భంగా బుధవారం సాయంత్రం భోగి పళ్ళ వేడుక ఘనంగా నిర్వహించారు.భోగి పండ్లు పోసి చిన్నారులను దీవించా రు. ఈ భోగి పండుగ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొని చిన్నారిని దీవించారు.





## చిన్నారి జ్ఞాన నిహాన్యాకు భోగి పండ్లు

- **ఆశీర్వదించిన పలువురు**

**వైరా, జనవరి 14(డిడి9 వార్త) :** భోగి రోజు సాయంత్రం చిన్నారుల తలపై రేగు పళ్లను పోయడం వల్ల వారిపై ఉన్న 'దృష్టి' (దిష్టి) తొలగిపోతుందని, బాలారిష్టాల నుంచి విముక్తి కలుగుతుందని పండితులు చెబుతుంటారు. అలాగే రేగు పండు సూర్యుడికి ఇష్టమైనది కావడం వల్ల, సూర్య భగవానుడి ఆశీస్సులు కూడా పిల్లలకు లభిస్తాయని నమ్మకం. మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదో వార్డులో బోగి పండుగ సందర్భంగా ఏబిఎన్ రిపోర్టర్ అక్కిశెట్టి రవితేజ ప్రియాంక దంపతుల కూతురు చిన్నారి అక్కిశెట్టి జ్ఞాన నిహాన్యాకు భోగి పండ్లు పోసి చిన్నారిని దీవించారు. ఈ భోగి పండుగ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొని చిన్నారిని దీవించారు.



# ఐద్వా జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

- **25న బహిరంగ సభకు మహిళలు కదిలి రావాలి**
- **ఐద్వా వైరా డివిజన్ కార్యదర్శి గుడిమెట్ల రజిత**



**వైరా, జనవరి 14(డిడి9 వార్త):** హైదరాబాద్ లో జరిగే ఐద్వా 14వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని, ఐద్వా జాతీయ మహాసభల సందర్భంగా జనవరి 25న హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద జరిగే బహిరంగ సభకు మహిళలు భారీగ తరలి రావాలని ఐద్వా వైరా డివిజన్ కార్యదర్శి గుడిమెట్ల రజిత అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని రెచర్ల బజార్ లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా పట్టణ నాయకురాలు మాడపాటి సుజాత ఐద్వా జెండాను ఎగురవేశారు. అనంతరం సభలో గుడిమెట్ల రజిత మాట్లాడుతూ మహిళపై జరుగుతున్న లైంగిక దాడులు, వివక్షతకు వ్యతిరేకంగా మహిళల హక్కుల కోసం ఐద్వా పోరాడుతుందని అన్నారు. కెంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, విద్యా, ఉద్యోగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జనవరి 25న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే బహిరంగ సభకు మహిళలు ఐద్వా చీర ధరించి భారీగా తరలివచ్చి ఐద్వా జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళ లందరికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా వైరా పట్టణ కార్యదర్శి తోట కృష్ణవేణి, వైరా డివిజన్ కమిటీ సభ్యురాలు కంసాని మల్లికాంబ, కట్ల ఆశ, మాడపాటి రమ, పువ్వాడ సరోజిని, గూడపాటి శ్రీజ, గూడపాటి మయూక, దర్గాబి, రేచర్ల రాణి, కొమరనేని భానుమతి, పొడపాటి లక్ష్మి, ఐలూరి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతతో అభివృద్ధి కోసం కృషి చేద్దాం

- **చొప్పకట్లపాలెం సర్పంచ్ కాటేపల్లి అశ్విని**
- **-పల్లెప్రపంచం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు**

**బోనకల్,జవనరి14,(డీడీ9 వార్త):** రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి గ్రామాభివృద్ధికి కృషి చేసుకుందామని చొప్పకట్లపాలెం సర్పంచ్ కాటేపల్లి అశ్విని అన్నారు. పల్లెప్రపంచం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా వైజ్ఞానిక, సాంస్కృతిక పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు పల్లా కొండలరావు అద్యక్షతన జరిగిన సభలో అశ్విని మాట్లాడుతూ ఐక్యత కోసం ఆటల పోటీలు దోహదం చేస్తాయన్నారు. సిపిఎం శాఖ కార్యదర్శి బోయినపల్లి పున్నయ్య మాట్లాడుతూ యువతను చైతన్య పరచేలా పల్లెప్రపంచం ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమాలు అభినందించదగినవన్నారు. ప్రతి సంవత్సరం నిర్వహించే జీనియస్ ప్రోగ్రాం చొప్పకట్లపాలెం గ్రామానికి మంచి పేరు తీసుకొస్తుందన్నారు. క్విజ్ పోటీలో ఏడు టీమ్ లు పాలొన్నాయి. శీలం గౌతమి టీమ్ ప్రథమ బహుమతి, దారెల్లి ప్రియాంక టీమ్ ద్వితీయ బహుమతి, వేశాల నాగరాజు తృతీయ బహుమతిని సాధించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూసి వెంకటేశ్వర్లు, సిపిఎం గ్రామ కన్వీనర్ చలమల అజెయ్ కుమార్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తన్నీరు కిషోర్, తెలుగుదేశం నాయకుడు నంజాల కోటేశ్వరరావు, పల్లెప్రపంచం ఫౌండేషన్ సభ్యులు కొండేటి అప్పారావు,రచ్చ మధు, మార్కపుడి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. క్విజ్ ప్రథమ బహుమతి విలువను కూసుమంచికి చెందిన చరణ్ కోచింగ్ సెంటర్, ద్వితీయ బహుమతిని చొప్పకట్లపాలెంకు చెందిన ఆవుల నాగమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, తృతీయ బహుమతిని ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, మనం దినపత్రిక ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో నామా పురుషోత్తంలు ఇచ్చినట్లు నిర్వాహకులు ప్రకటించారు



## గోవిందాపురం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు

**బోనకల్,జనవరి 14,(డీడీ9 వార్త):** సంక్రాంతి పండుగ సందర్భంగా గోవిందాపురం ఏ గ్రామంలో భాగం సేవా ఫౌండేషన్ అధినేత భాగం రాకేష్ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించటం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు,గ్రామ సర్పంచ్ ఇస్రం కరుణ పాల్గొని బహుమతులు ప్రధానం చేశారు,ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ వడ్డబోయిన ఉపేంద్ర,మిగిలిన వార్డు నెంబర్లు మాజీ సర్పంచ్ భాగం శ్రీనివాసరావు,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భాగం పాపారావు,మండల నాయకులు భాగం నాగేశ్వరరావు, తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షులు కావూరి జనార్దన్ రావు,భాగం సాయి ప్రసాద్,కావూరి వెంకట్రావు,మాజీ సర్పంచ్ మేడేపల్లి కోటేశ్వరరావు,బొబ్బిళ్ళ తిరుపతి వడ్డబోయిన సాయి పాల్గొన్నారు.



# నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలి: సింగరేణి డైరెక్టర్ (పి & పి)

**మంథని, జనవరి 14 (డిడి 9 వార్త):**

సింగరేణి సంస్థ నిర్దేశించిన ఓబి, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ భద్రతతో సాధించాలని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన సింగరేణి రామగుండం-3 ఏరియా, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలలో పర్యటించారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయంలోరామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ ఎస్. మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావులు డైరెక్టర్‌కు స్వాగతం పలికారు.



అనంతరం రామగుండం-3 ఏరియా జీఎం ఎస్. మధుసూదన్‌తో పాటు ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, ఆర్జీ కోల్ మైన్ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. తదుపరి అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో జీఎం కొలిపాక నాగేశ్వరరావుతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశమై మూడో ప్యానెల్ సాల్వేజింగ్ పనుల పురోగతి, నాలుగో ప్యానెల్ తయారీ పనులపై సమీక్షించారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ, యంత్రాలను ఎక్కువ సమయం అందుబాటులో ఉంచి సమర్థవంతంగా వినియోగించుకోవాలని, పని విధానంలో మెరుగులు దిద్దుకోవాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా రెండు నెలల సమయం మాత్రమే ఉన్నందున, సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు స్పష్టమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ సాల్వేజింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేసి భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం నూతనంగా రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్. మధుసూదన్‌ను డైరెక్టర్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జియం ఎం. రామ్మోహన్, విభాగాధిపతులు రాజారెడ్డి, బీ.టీ. మురళీకృష్ణ, బీ.వి. సత్యనారాయణ, ఐలయ్య, షబ్బీరుద్దీన్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆర్జీ–3 జీఎంను ఘనంగా సన్మానించిన బీఎంఎస్ నాయకులు

**మంథని, జనవరి 14 (డిడి 9 వార్త):**

ఆర్జీ-3 ఏరియాకు నూతనంగా విచ్చేసిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ జనరల్ మేనేజర్ సుంకరి మధుసూదన్ రావును బీఎంఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బీఎంఎస్ ఆర్జీ-3 ఏరియా ఉపాధ్యక్షుడు అరుకుల ప్రసాద్, సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ కార్మిక మజ్దూర్ సంఘ్ రామగుండం కార్యదర్శి దాసరి శ్రీనివాస్, కేంద్ర కార్యదర్శి ఈనుముల సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే ఏరియా కమిటీ నాయకులు ఎండి జానీ, పాక కృష్ణ, నరసన్న, పిట్ కమిటీ నాయకులు మెలుగు సంతోష్, కందుల మహేష్, వెంకటేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమానికి



నూతన జీఎం చొరవ చూపాలని, సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం సానుకూల వాతావరణంలో కొనసాగింది.

# జర్నలిస్టుల అరెస్టుమీడియా స్వేచ్ఛపైదాడే



- **తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (ఎన్ యూజే-ఐ)**

**భూపాలపల్లి జనవరి 14( డిడి 9 వార్త )**

జర్నలిస్టులను అరెస్టు చేయడం అంటే మీడియా స్వేచ్ఛపై దాడి చేసినట్టేనని తెలంగాణ స్టేట్ జనరల్ లిస్ట్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్ అన్నారు ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టులైన దొంతు రమేష్,చారి,సుధీర్లను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తప్పు పట్టారు. దీనిని స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (ఎన్.యూజేఐ) తీవ్రంగా ఖండిస్తుందని ఆయన అన్నారు. అరెస్టులు మీడియా స్వేచ్ఛను హరించే చర్యలని అన్నారు.అరెస్టుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం, మీ డియో స్వేచ్ఛగా రాయొద్దు, ప్రభుత్వాన్ని ప్రశ్నించొద్దు, అధికారంలో ఉన్నవారి మీద కథనాలు రాస్తే జైలు తప్పదు అనిచెప్పాలనుకుంటున్నట్టుగా చర్యలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు.మీడియాలో ఒక అంశంపై కథనం వచ్చినప్పుడు, అందులోని నిజానిజాలపై అధికారులు విచారణ జరిపించాలి.కానీ ఆ అంశాన్ని బయటికి తీసుకొచ్చిన జర్నలిస్టుల మీదే కేసులు పెట్టి వేధించడం ప్రజాస్వామ్యంలో ఎక్కడా సమంజసం కాదన్నారు. సోర్స్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఆధారంగానే కథనాలు తయారు అవుతాయన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన మంత్రులు, అధికారుల మీద ఆరోపణలు వస్తే,ఆ ఆరోపణల నిజానిజాలు నిగ్గు తేల్చాల్సింది ప్రభుత్వం, తప్పు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి కానీ ఆ పని చేయకుండా,జర్నలిస్టుల మీద పడి కేసులు పెట్టడం అంటే, ప్రభుత్వంలో ఉన్నవారు ఏం చేసినా చెల్లుతుందనే సంకేతాన్ని ప్రజలకు ఇవ్వడమేనని ఆయన అన్నా రు. ఏ వ్యక్తిగత ఫిర్యాదు లేకుండా,ఆ కేసులో పేర్లు లేకున్న కేవలం ఒక సంఘం ఫిర్యాదును ఆధారం చేసుకొని జర్నలిస్టులను అరెస్ట్ చేయడం పూర్తిగా తప్పని, ఇది చట్టం కాదనీ ,భయపెట్టే ప్రయత్నం అన్నారు.ప్రభుత్వం ఈ కేసు ను వెంటనే ఎత్తివేసి, జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు.మీడియా స్వేచ్ఛపై దాడులు ఆపకపోతే పెద్ద జర్నలిస్ట్ ఉద్యమంగా మారుతుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తడుక సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్ జిల్లా ఉపాధ్యక్షుడు గట్టు రవీందర్, సంయుక్త కార్యదర్శులు కడపాక రవి,పల్నాటి రాజు,మారెపల్లి చంద్ర మౌళి, భూపాల్,జగన్, కారుకూరి సతీష్ హేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీలకు కేంద్రం నిధులు

- **బిజెపి ములుగు మండల అధ్యక్షుడు నాగరాజు**



**డీ డీ 9 వార్త, ములుగు బ్యూరో :**

బీజేపీ ములుగు మండల అధ్యక్షులు రాయంచు నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన గత రెండేళ్ల నుంచి గ్రామపంచాయతీ పాలకపక్ష ఎన్నికలు జరగకపోవడం వలన, మొన్న ఈ మధ్యలనే గ్రామపంచాయతీ ఎన్నికలు జరగడం వలన గతంలో పెండింగ్లో ఉన్నటువంటి 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వం 2500 కోట్ల నిధులు పెండింగ్లో పెట్టడం జరిగింది. అయినా కూడా కొత్త పాలక పక్షం ఏర్పడడం వలన కేంద్ర ప్రభుత్వం పాత బకాయిలు ఉన్నటువంటి 2500 కోట్ల నిధులలో భాగంగా తక్షణమే 1000 కోట్లు ఈ నెలాఖరి లోపు విడుదల చేసి, వచ్చే నెలలో మిగతా నిధులు విడుదల చేస్తామని చెప్పడము చాలా హర్షనీయం. కాబట్టి భారతీయ జనతా పార్టీ ములుగు మండలం తరపున కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకోవడం జరుగుతున్నది. అదేవిధంగా గ్రామపంచాయతీలు కొత్తగా ఏర్పడినవి కావున ఆ నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా వాడుకొని కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నటువంటి పథకాలు అన్నీ కూడా ప్రజలకు తెలిసేలా చెప్పాలని మేము కోరడం జరుగుతున్నది.

# భోగి–సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, జనవరి 14 (డిడి 9 వార్త):**

మంథని నియోజకవర్గ ప్రజలందరికీ భోగి మరియు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, మంథని ఎమ్మెల్యే శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, భోగి-సంక్రాంతి పండుగలు రైతుల కష్టానికి ప్రతిఫలంగా వచ్చే ఆనందోత్సవాలని పేర్కొన్నారు. ఈ పండుగలతో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అలాగే మంథని నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని, ప్రతి కుటుంబం సంతోషంగా జీవించాలని ఆయన కోరారు. ప్రజలంతా ఐక్యతతో పండుగలను జరుపుకుంటూ, సంప్రదాయాలు కాపాడాలని మంత్రి పిలుపునిచ్చారు.

# గంగపుత్ర క్యాలెండర్ ఆవిష్కరణ

**మంథని జనవరి 14 (డిడి 9 వార్త);**

మంథని మండలం దుబ్బపల్లి గ్రామంలో గంగపుత్రుల కులదైవం శ్రీ గంగాదేవి అమ్మవారి శ్రీ గంగాదేవి నిత్య ధిపారాధన కమిటీ 2026 నూతన సంవత్సర క్యాలెండరు ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. బుధవారం దుబ్బపల్లి గంగపుత్ర కుల పెద్దలు శ్రీ గంగాదేవి నిత్య దీపారాధన కమిటీ ప్రధాన సభ్యులు తోకల రమేష్ ఆధ్వర్యంలో పల్లికొండ రాజేందర్ధర్మాజీ చంద్రయ్య మేడి నరసయ్య పల్లికొండ శంకరయ్య కాళ్ల లింగయ్యల చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు ధర్మాజీ లస్వమ్మ, తోకల పద్మ కునారపు పోసమ్మ పల్లికొండ సాగరిక ధర్మజీ మాధవి తోకల పోసమ్మ ధర్మాజీ పద్మ బోరే ఉమా తోకల స్రవంతి తదితరులు పాల్గొన్నారు.





# ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు సన్మానం

**మంథని, జనవరి 14 (డిడి 9 వార్త):**

ఇటీవల ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ ప్రెస్‌క్లబ్‌ను ఏర్పాటు చేసుకున్న మీడియా ప్రతినిధులను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ బుధవారం ఘనంగా సన్మానించారు. మంథనిలోని రాజగృహాలో మీడియా ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలువగా, వారికి శుభాకాంక్ష లు తెలుపుతూ శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు నిజాలను నిర్భయంగా వెలుగు లోకి తీసుకురావాలని, ప్రజలను చైతన్యం చేసే దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కా రానికి కృషి చేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటైన ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ ప్రెస్‌క్లబ్ సభ్యులు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌ను శాలువాతో సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో పలువురు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహిళలకు ఉచితంగా పాస్ ఫోటోలు

- **ఈ అవకాశాన్ని మహిళామణులందరు వినియోగించుకోవాలి**
- **ఎస్వీఆర్ ఫోటో ఫ్యాక్టరీ అధినేత డాక్టర్ ఏల్పుల వెంకటేష్**



**మంథని, జనవరి 15 (డిడి 9 వార్త);**

మంథని పట్టణం గాంధీచౌక్ లోని ఎస్వీఆర్ ఫోటో ఫ్యాక్టరీ ఆధ్వ ర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురు, శుక్రవా రాలు రెండు రోజులపాటు మహి ళలందరికీ 8 పాస్ పోర్టు సైజు ఫోటోలను ఉచితంగా అందించను న్నారు. తాను సంపాదించిన కొంత మొత్తాన్ని సమాజ సేవకు ఖర్చు చేస్తున్నానని అందులో భాగంగా మహిళామణులందరికీ రెండు రోజు లపాటు ఉచితంగా ఎనిమిది పాస్పో ర్ట్ సైజు ఫోటోలను అందిస్తున్నట్లు ఎస్వీఆర్ ఫోటో ఫ్యాక్టరీ అధినేత డాక్టర్ ఏల్పుల వెంకటేష్ తెలిపారు .ఈ రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఈ అవకాశాన్ని కల్పించను న్నామన్నారు. కావున మహిళమణు లందరూ సద్వినియోగం చేసుకోవా లని వెంకటేష్ కోరారు.

# పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత

**డిడి9 వార్త జనవరి14 కారేపల్లి:**

రెండేళ్ల క్రితం పోగొట్టుకున్న సెల్ ఫోన్ ను కారేపల్లి ఎస్సై గోపి బాధిత వ్యక్తికి బుధవారం అప్పగించారు. కారేపల్లి మండలం బొక్కలతండాకు గ్రామానికి చెందిన బానోత్ వెంకటేష్ రెండేళ్ల క్రితం తన ఒప్పో సెల్ ఫోన్ ను పోగొట్టుకున్నాడు. వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు తో పోలీసులు నూతన సాంకేతిక పరిజ్ఞానం(సీఈఐఆర్) పోర్టల్ ద్వారా విచారణ నిర్వహించా రు. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా లో ఫోన్ ట్రేస్ చేసి రికవరీ చేసి అప్పగించి



నట్లు ఎస్సై తెలిపారు. ఈ రికవరీలో మహిళా కానిస్టేబుల్ భానుశ్రీ సాం కేతికను ఉపయోగించి కీలక పాత్ర పోషించారని ఎస్ఐ తెలిపారు.

# ఆర్‌జీ–3 జీఎం కార్యాలయాన్ని సందర్శించిన సింగరేణి డైరెక్టర్

**మంథని, జనవరి 14 (డిడి 9 వార్త):**

రామగిరి మండలం పన్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఆర్‌జీ-3 జీఎం కార్యాలయాన్ని సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్లానింగ్ & ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు బుధవారం సందర్శించారు. ఈ సంద ర్భంగా పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్, లొంకా కేసారం, వీరగోని రామాదేవి శ్రీనివాస్, పన్నూర్ ఉపస ర్పంచ్ కావేటి మల్లేశ్వరి కలిసి సింగరేణి డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు, ఆర్‌జీ-3 జీఎం సుంకరి మధుసూదన్, ఏఎల్పీ జీఎం కొలిపాక నాగేశ్వరరావులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించి సంక్రాంతి శుభా కాంక్షలు తెలిపారు. ఈ భేటీలో సర్పంచ్ చిందం మహేష్ పన్నూర్ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డైరె క్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గ్రామ రహదారుల దుస్థితి, మురుగునీటి సమస్య, తాగునీటి సరఫరా లోపాలు, విద్యుత్ అంతరాయాలు, పారిశుధ్య సమస్యలను వివరించి, వీటిని త్వరితగ తిన పరిష్కరించేందుకు సింగరేణి సంస్థ సహకరించాలని కోరారు.

దీనికి స్పందించిన సింగరేణి డైరెక్టర్



కె. వెంకటేశ్వర్లు గ్రామ సమస్యలను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో వార్డు సభ్యులు మున్నీ, ప్రశాంత్, సదానందం, ప్రదీప్, మట్ట రాజ్‌కుమార్‌తో పాటు గ్రామ ప్రజా ప్రతినిధులు, ఇతరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ గోదా రంగనాయకుల కల్యాణం

**మంథని, జనవరి 14 (డిడి 9 వార్త):**

రామగిరి మండలంలోని లద్నా పూర్ గ్రామంలో శ్రీ గోదా రంగనాయకుల కల్యాణం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో భక్తుల కోలాహల మధ్య ఈ కల్యాణోత్స వం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ప్రధానార్చకులుగా సముద్రాల శ్రీనివాసాచార్యులు వ్యవహ రించగా, అర్చకులు ఆదిత్య వేదమం త్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అలంకార సేవలతో ఉత్సవాలు ప్రారంభమై, మంగళ వా యిద్యాలు, వేద మంత్రాల నడుమ శ్రీ గోదా రంగనాయకుల కల్యాణ ఘట్టం వైభవంగా సాగింది.

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టగా, గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదాన కార్య



క్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. శ్రీ గోదా రంగనాయకుల కల్యాణాన్ని దర్శించుకో వడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తూ కుటుంబ సమేతంగా హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. లగ్నాపూర్ గ్రామంలో జరిగిన ఈ కల్యా ణోత్సవం ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చింది.


# మంగపేటలో మీసేవ నిర్వహికుడు ఆత్మహత్య – మద్యం బానిసత్వమే కారణమా?

**మంగపేట,జనవరి 14డీడీ 9వార్త**

ములుగు జిల్లా మంగపేట మండల కేం ద్రానికి చెందిన మీసేవ నిర్వహికుడు తా ళ్లపెల్లి వీరకిశోర్ (42), తండ్రి యాదగిరి, గత కొద్ది నెలలుగా మద్యానికి బానిసై ప్ర తిరోజూ మద్యం సేవిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై ఆయన భార్య తాళ్లపెల్లి స్వాతి ఎన్నిసార్లు తాగుడు మానేయాలని కోరినప్పటికీ ఆయన వి నకపోవడం కుటుంబంలో కలహాలకు దారి తీసినట్టు సమాచారం. ఈ క్రమంలో 2026 జనవరి 13వ తేదీ రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన వీరకిశోర్‌ను తాగుడు మానేయాలని భార్య స్వాతి మం దలించడంతో, క్షణిక ఆవేశానికి లోనై తీవ్ర మనస్తాపానికి గురైనట్టు తెలుస్తోంది. ఆ రాత్రి రాత్రి 10.00 గంటల నుండి 14వ తేదీ ఉదయం 07.00 గంటల మధ్య సమయంలో, ఇంటిలోని బెడ్‌రూమ్‌లో సిలింగ్ ఫ్యాన్‌కు నైలాన్ తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

విషయం వెలుగులోకి రావడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా, మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు మంగపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టారు.

ఈ ఘటన మంగపేట మండలంలో తీవ్ర విషాదాన్ని నింపింది. మీసేవ ని ర్వహికుడిగా ప్రజలకు సేవలందిస్తున్న



వీరకిశోర్ ఇలా అకాల మరణం చెందడం స్థానికులను కలచివేసింది.

# నిరుపేద మహిళకు కుట్టుమిషన్ అందజేత

**వైరా, జనవరి 14(డిడి9 వార్త ):**

స్థానిక వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యం లో లయన్స్ క్లబ్ కోశాధికారి గద్దె నీరజ పుట్టినరోజు పురస్కరించుకొని నిరుపేద మహిళకు సాయిబాబా మందిరంలో లయన్ మెంబర్ తిరుపతి శ్రీనివాసరావు చొరవతో కుట్టు మిషన్ ను ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ చేతుల మీదుగా బుధవారం జిల్లా మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భం గా మురళీకృష్ణ మాట్లాడుతూ గత 12 సం వత్సరాలుగా ఎంతో మంది నిరుపేదలను ఆదుకుంటూ లయన్స్ క్లబ్ సేవా కార్యక్ర మాల్లో ముందుందని ఆయన తెలిపారు. ఇందిరమ్మ కాలనీకి చెందిన ప్రమాదవ శాత్తు గాయపడిన మహిళకు లగడపాటి ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో పదివేల రూపాయలు అందించామని అదే స్ఫూ ర్తితో ఎంతోమంది చదువుకు దూరమైన నిరుపేద విద్యార్థులను గతంలో కూడా ప్ర భాకర్ రావు ఆదుకున్నారని ఈ సందర్భం గా గుర్తు చేశారు.ఇదే స్ఫూర్తితో ఈరోజు పుట్టినరోజు జరుపుకుంటున్న క్లబ్ కోశాధి కారి గద్దెనీరజ ఎల్ సి ఎఫ్ ఐ కోఆర్డినేటర్ చింతలపూడి వెంకటేశ్వరరావు పుట్టిన రోజు కూడా బుధవారం జరుపుకోవడం ఆనందదాయకమని ఆయన అన్నారు. ప్రతి క్లబ్ సభ్యులు తమ తమ పెళ్లిరోజులు పుట్టినరోజులు సేవా కార్యక్రమాలకు సేవ ద్వారా అందించి అర్హులైన నిరుపేదలను అందర్నీ ఆదుకోవాలని సూచించారు.




లయన్స్ క్లబ్ సభ్యులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలను మురళీకృష్ణ తెలియజే శారు. పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి లయన్స్ క్లబ్ సభ్యులందరూ ఇరువు రికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజన్ కోఆర్డినేటర్ ఉండ్రు శ్యాంబాబు,క్లబ్బు మహిళా కోఆ ర్డినేటర్ మాదినేని సునీత,క్లబ్ సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరావు,జోన్ చైర్మన్ చింతోజు నాగేశ్వరరావు, రీజన్ సెక్రెటరీ పెనుగొండ ఉపేందర్ రావు,సాయిబాబా మందిరం కోశాధికారి లగడపాటి బోస్, తిరుపతి శ్రీనివాసరావు తదితరులు పా ల్గొన్నారు.

# సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

- ముగ్గుల పోటీలు సంస్కృతి ఐక్యతను బలోపేతం చేస్తాయి
- సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం
- జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు
- ఐద్వా వైరా డివిజన్ కార్యదర్శి గుడిమెట్ల రజిత.



**వైరా, జనవరి 14(డిడి9 వార్త) :**

ముగ్గుల పోటీలు గ్రామీణ సంస్కృతి, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, ఐద్వా వైరా డివిజన్ కార్యదర్శి గుడిమెట్ల రజిత అన్నారు. వైరా మండలం పాలడుగు సిపిఐ(ఎం) గ్రామ శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామంలోని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో ముగ్గుల పోటీలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ప్రథమ బహుమతి కేసగాని రజని, రెండోవ బహుమతి వడ్డెబోయిన వెంకటలక్ష్మి, మూడోవ బహుమతి అరెపల్లి అనూష, నాల్గవ బహుమతి కేసగాని కవిత సాధించారు, పాల్గన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, గుడిమెట్ల రజిత మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా గ్రామంలోని మహిళల్లో ఐక్యత పెరగడానికి ముగ్గుల పోటీలు దోహదం చేస్తాయని అన్నారు. మహిళలను ప్రోత్సహిస్తూ మంచిని బోధించే సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలని అన్నారు. మహిళల సృజనాత్మకతను వెలికి తీయడానికి, మహిళల్లో చైతన్యం పెంచడానికి, మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికీ ముగ్గుల పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల కమిటీ సభ్యులు బాజోజు రమణ, షేక్ మజీద్, సీనియర్ నాయకులు వనమా చిన్న సత్యనారాయణ, పాలడుగు సర్పంచ్ గద్దల నరసింహారావు, ఉప సర్పంచ్ ఓర్సు సూజాత, గ్రమ శాఖ కార్యదర్శి షేక్ మజీద్ బీ, సిపిఎం వార్డ్ మెంబర్ షేక్ రేహనా బేగం, షేక్ రఫీ, షేక్ అబ్దుల్ రహీం, షేక్ మౌలాలి, షహనాజ్ పాల్గొన్నారు.









# రెడ్ క్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

**డీ డీ 9 వార్త, ములుగు బ్యూరో :**

ములుగు జిల్లా ములుగు మండలం జగ్గన్న గూడెం బోడ రామయ్య గడ్డ గుత్తి కోయగూడెంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 8:00 గంటలకు దుస్తుల పంపిణీ కార్యక్రమం జరిగింది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (స్టేట్ బ్రాంచ్) అధ్యక్షుడు జిష్ణు దేవ్ వర్మ ఆదేశాల మేరకు ములుగు జిల్లా కలెక్టర్, ములుగు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు దివాకర టి.ఎస్. ఐఏఎస్ సూచన మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ ఏ అప్పయ్య ఆధ్వర్యంలో అభయ ఫౌండేషన్ అందించిన దుస్తులను 20 కుటుంబాలకు ఇండియన్ రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ జి. శ్రీనివాస్, కోశాధికారి ఎస్.సతీష్, కార్యదర్శి సిహెచ్. రమేష్ ములుగు జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యుడు జి. మహిపాల్ రెడ్డి, ములుగు జిల్లా వాలెంటీర్స్ ఎస్.రవీందర్రెడ్డి, పింగిలి నాగరాజు.సర్పంచ్ ఈక కుమార్, గూడెం పెద్ద మాడవి లింగమూర్తి లతో గూడెంలో నివసిస్తున్న గుత్తి కోయలకు కుర్తాలు, పెట్టీకోట్లు, బ్లౌజ్‌లు, దుప్పట్లు, షార్ట్‌లు, పైజామాలు, ప్యాంటు, షర్టులు, ఇతర రకాల దుస్తులు అందజేయడం జరిగినది.

ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ములుగు చైర్మన్ డాక్టర్ ఏ అప్పయ్య మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ గుత్తి కోయగూడాలను అభివృద్ధి చేసే దిశలో వారికి అవసరమగు సామాగ్రిని వస్తువులను అందజేస్తుందని తెలియజేశారు. ఈ సందర్భంగా చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారికి వివరించారు. అనారోగ్యంగా ఉన్న మహిళను పరీక్షించి త్వరగా ఆసుపత్రికి తీసుకుపోయి చికిత్స అందజేయాలని గూడెం పెద్ద కు తెలియజేసి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసినారు.కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులతోపాటు గొట్టి కోయ సంఘం పెద్దలు,గోత్తి కోయవాసులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా జరిగిన ముగ్గుల పోటీలు

**డీ డీ 9 వార్త, ములుగు బ్యూరో :**

లక్ష్మీదేవి పేట గ్రామపంచాయతీ ఆవరణలో జరిగినటువంటి సంక్రాంతి ముగ్గుల పోటీలకు అధిక సంఖ్యలో తరలివచ్చిన చిన్నారులు మహిళలు. దీనిలోమహిళలు (సీనియర్స్) విభాగంలో బొమ్మ కంటి వంశావతీరమేష్ (సర్పంచ్) గారు మొదటి బహుమతి 3016/, కొండ తిరుపతి (ఉపసర్పంచ్) రెండవ బహుమతి 2016/, మూడో బహుమతి కడవెండి తిరుపతి 1516/, నాలుగో బహుమతి అన్ని వార్డుల సభ్యులు 1016/ రూపాయలు అందజేయడం జరిగింది. జూనియర్స్(చిన్నారుల)విభాగంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు, మూడు వీరేష్ మొదటి బహుమతి, 1516/, గ్రామ పన్నెండవ వార్డు అభ్యర్థి మద్దెల సువర్ణ రమేష్ గారు రెండవ బహుమతి 1016/, కాసాని శ్రీహరి గారు మూడో బహుమతి 616/, గంధం కవిత లక్ష్మణ్ నాల్గవ బహుమతి 516/ రూపాయలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బొమ్మకంటి వంశావతీ రమేష్ మాట్లాడుతూ.. భోగి మీ ఇంట భోగభాగ్యాలను తీసుకురావాలని, సంక్రాంతి మీకు సుఖ సంతోషాలను విరజిమ్మాలని, అలాగే కనుమ మీకు కమనీయమైన అనుభూతులను అందించాలని శుభాకాంక్షలు తెలియజేస్తూ మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ చిత్తశుద్ధితో పని చేస్తుందని, మహిళల సాధికారతే ముఖ్యమని చెప్పారు. దీనిలో భాగంగా గ్రామ అభివృద్ధే ధ్యేయంగా మంత్రి సీతక్క ఆదేశాల మేరకు గ్రామాన్ని అభివృద్ధి మార్గంలో తీసుకెళ్తానని, ఒక్కటొక్కడిగా ఇచ్చిన హామీలన్ని సమయానికి పూర్తి చేస్తానని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండ తిరుపతి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు మూడు విరేష్,వార్డు సభ్యులు కడివేండి తిరుపతి,పొన్నం మౌనిక రాము,గజవేణి అనిత ధనుంజయ, మద్దెల సువర్ణ రమేష్,మాజీ ఉప సర్పంచ్ కాసాని శ్రీహరి గ్రామ వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యువజన నాయకులు పాల్గొనడం జరిగింది.





# మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిని కలిసిన సింగరేణి డైరెక్టర్

**మంథని, జనవరి 14 (డిడి 9 వార్త):**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు బుధవారం మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ భేటీలో ఆర్జీ-3 సింగరేణి ప్రాంతంలోని ప్రస్తుత కార్యాచరణ, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, కార్మికుల సంక్షేమం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రాంత అభివృద్ధికి సింగరేణి సంస్థ కీలక పాత్ర పోషిస్తున్నదని, ప్రజలకు మరింత మేలు చేకూర్చే విధంగా ప్రాజెక్టులు అమలు చేయాలని ఈ సందర్భంగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

# కళాధర్ రెడ్డి హఠాన్మరణం



**మంథని, జనవరి 14 (డిడి 9 వార్త):**

రామగిరి మండలంలోని సెంటినరీ కాలనీకి చెందిన సింగరేణి ఫారెస్ట్ కాంట్రాక్టర్, రామగిరి హైస్కూల్ ప్రిన్సిపాల్‌గా సేవలందించిన కళాధర్ రెడ్డి హార్ట్ స్ట్రోక్‌తో బుధవారం అకస్మాత్తుగా పరమపదించారు. ఈ వార్త తెలియగానే విద్యార్థులు, ఉపాధ్యాయులు, సహచరులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

విద్యారంగంలో ఆయన చేసిన సేవలు, విద్యార్థుల భవిష్యత్తు కోసం చూపిన నిబద్ధత అందరికీ ఆదర్శంగా నిలిచాయని పలువురు గుర్తుచేసుకున్నారు. కళాధర్ రెడ్డి మృతి రామగిరి ప్రాంతంలో తీరని లోటుగా భావిస్తున్నామని పలువురు అన్నారు.

ఆయన పవిత్రాత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, శోకసంతప్తులైన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ఇది ప్రజాస్వామ్యమా లేదా ఎమర్జెన్సీ పాలనా ?

- జర్నలిస్టులు దొంతు రమేష్,
- పరిపూర్ణాచారి సుధీర్ ల అక్రమ అరెస్ట్ దారుణం
- టిఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి





**డీ డీ 9 వార్త, ములుగు బ్యూరో :**

కాంగ్రెస్ ప్రభుత్వం తమయొక్క రాజకీయ క్రీడలో భాగంగా మంత్రులను బదునామ్ చేయడానికి టీవీ చానెళ్లకు లీకులు ఇచ్చి ఉపయోగించుకోవడం మరల వారిమీదనే సిట్ వేసి అర్ధరాత్రి అక్రమంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తలుపులు బద్దలు కొట్టి ఇంట్లోకి వెళ్లి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము, జరుగుతున్న పరిణామాలన్నీ, డ్రామాలన్ని యావత్ తెలంగాణ ప్రజలకు తెలుసనీ, ఎమర్జెన్సీని తలపించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు ఉన్నావని తెలుపుతూ, వారిని బేషరతుగా వెంటనే విడుదలచేయాలి డిమాండ్ చేస్తున్నాము.



# ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల పంపిణీ

- **విజేతలకు బహుమతులు అందించిన సర్పంచ్ నిరోషా అమర్ సింగ్**

**డీ డీ 9, వార్త, ములుగు బ్యూరో :** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని యువశక్తి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కాసిందేవిపేట గ్రామ సర్పంచ్ వాంకుడోత్ నిరోషా అమర్ సింగ్ మొదటి విజేత కట్ల సునీత గారికి మరియు రెండవ విజేత లైశెట్టి సంగీత కి షీల్డ్ లను బహుమతులుగా అందించి శుభాకాంక్షలు తెలిపారు మరియు పోటీదారులను అభినందించారు. మరియు యువశక్తి యూత్ అసోసియేషన్ సభ్యులను గ్రామానికి వివిధ రకాల సేవలు చేయాలని కోరుతూ వారికి టీషర్ట్స్ ని అందించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సుదర్శన్ మాజీ ఎంపీటీసీ దేవర్నేని స్వామి రావు యూత్ అధ్యక్షులు పార్థు ఉపాధ్యక్షులు భరత్ మరియు ప్రదీప్ గారు గుండెల భాస్కర్ మరియు యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# తబితా ఆశ్రమ పిల్లలు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి

**డిడి9వార్త / రామగుండం జనవరి 15:**

ఆశ్రమ పిల్లలకు పతంగులు, సంక్రాంతి పండుగ ఫలహారాలు అందజేసిన మద్దెల దినేష్.

పిల్లలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపిన సిపిఐ ప్రజా సంఘాల నాయకులు.

రామగుండం తబితా ఆశ్రమంలో ఉన్న పిల్లలందరూ మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి దేశానికి సేవలు అందించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఆశ్రమం లో ఉన్న పిల్లలకు సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులు, పండుగ ఫలహారాలైన సకినాలు, అర్షలు, కారంపూస అందించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా గత రెండు దశాబ్దాలుగా ఆశ్రమంలో ఉన్న నిరాశ్రయులైన పిల్లలందరినీ తన పిల్లలుగా భావించి వారికి తల్లిదండ్రులు లేని లోటును తీరుస్తూ సేవలందిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు వీరేంద్ర నాయక్ ను శాలువాతో సత్కరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ ప్రజా సంఘాల నాయకులు ఎం.ఎ.గౌస్, వై.లెనిన్,తొడుపునూరి రమేశ్ కుమార్ లు ఆశ్రమం లో ఉన్న పిల్లలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలపడం జరిగింది.







# గంగిరెద్దు ఆటతో.. హరిదాసుల కీర్తనలతో..

- **ఆనందోత్సాహాల నడుమ. సందడిగా భోగి మంటలు వేడుక..**
- **ఉత్సాహంగా కేరింతలు తొక్కిన యువత..**
- **భోగి మంట చుట్టూ తిరుగుతూ నృత్యాలతో సందడి ...**

**వైరా, జనవరి 14(డిడి 9 వార్త ) :** కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పురావూరి శబరినాథ్ ఆధ్వర్యంలో.. సంక్రాంతి పండుగ లో భాగంగా.. బుధవారం తెల్లవారుజామున నిర్వహించిన భోగిమంటలు వేడుక అంగరంగ వైభవంగా సాగింది.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్తక సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు హాజరయ్యారు.. పిడకలు వేసి భోగి మంటలు కార్యక్రమాన్ని ప్రారంభించారు.. సంక్రాంతి మూడు రోజుల పండుగలో భాగంగా తొలి రోజు భోగి వేడుకల సంబరాలు వైరాలోని గాంధీ చౌక్ లో అంబరాన్ని తాకాయి.ఈ కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో మహిళలు యువతులు యువకులు పురుషులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు.భోగిమంటల వేడుక సాంప్రదాయ బద్ధంగా సంస్కృతి సాంప్రదాయాలను చాటి చెప్పే విధంగా కొప్పురావూరి శబరినాథ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భోగి మంటలు చుట్టూ మహిళలు యువకులు చిన్నారులు పెద్దలు నృత్యాలు వేసి సందడి చేశారు. వ్యాపారాలు ఉద్యోగాల నిమిత్తం స్వస్థలాన్ని విడిచి వెళ్లి పండుగ సందర్భంగా ఇంటికి వచ్చిన ఇతర ప్రాంతాల్లో ఉండే వారు కూడా ఈ కార్యక్రమంలో హాజరై సంతోషంగా వేడుకలను జరుపుకున్నారు. హరిదాసుల కీర్తనలు గంగిరెద్దు ఆటతో హరిదాసుల పాటతో భోగిమంటల వేడుక ఆధ్యాత్మిక శోభను అలుముకుంది.డు డు బసవన్నలు హరిలో రంగా హరి అంటూ దీవించే హరిదాసులు సన్నాయి డోలు వాయిద్యాలు తో అనుగుణంగా ఆడే గంగిరెద్దులతో భోగిమంట వేడుక నేటి తరానికి సంస్కృతి సాంప్రదాయాలను చాటి చెప్పే విధంగా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు లయన్స్ క్లబ్ పెద్దలు డాక్టర్ కాపా మురళీకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు , వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పమ్మి అశోక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐ వి నాగేశ్వరరావు తో పాటు పలువురు కాంగ్రెస్ పెద్దలు ఈ కార్యక్రమానికి హాజరై వేడుకను తిలకించారు.ఈ కార్యక్రమంలో కొప్పురావూరి కృష్ణమూర్తి కొప్పు రావూరి ఝాన్సీ రాణి, కొప్పురావూరి ప్రవళిక, మిట్టపల్లి నాగియంద్రపుడి శివశంకర్ నాయుడు,వరుణ్ మాలే ఉదయతేజ, కొణతాలపల్లి సుజిత్, వనమా చిన్ని, రంగా,సింహాద్రి కొల్లా రాంబాబు, నూకల వాసు, వేముల కిషోర్,తెల్లాకుల సందీప్,వీరంశెట్టి సీతారాములు, సుగల మాధవి,మిట్టపల్లి మహాలక్ష్మి,మౌనిక అనూష, మిట్టపల్లి సౌమ్య, వనమా రూప పాల్గొన్నారు.

# అంత్య పుష్కరాలకు అన్ని ఏర్పాట్లుచేయాలి

**మహాదేవపూర్ జనవరి 14 ( డిడి 9 వార్త )**



దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరంలో మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న సరస్వతి అంత్యపుష్కరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.

బుధవారం కాళేశ్వరం దేవాలయ ఈఓ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, ఆర్కిటెక్చర్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి అంత్యపుష్కరాల నిర్వహణ ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం నిర్వహించిన ఆది పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని అంత్య పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండాసౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. గత పుష్కరాలలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.


సరస్వతి అంత్యపుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం 30.16 కోట్ల నిధులను మంజూరు చేసిందని, ఇందులో రూ. 16 కోట్లతో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అంచనాలు తయారుచేసి ప్రతిపాదనలు పంపించాలని, ఫిబ్రవరి మొదటి వారంలోపే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.కాళేశ్వరం మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా శాశ్వత పనులు చేపట్టాలని, పుష్కరాల సమయంలో భక్తుల రాకపోకలు, భద్రత, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కాళేశ్వరానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు బాధ్యతా యుతంగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ సరస్వతి అంత్యపుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన బందోబస్తు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్, భక్తుల భద్రత వంటి అంశాలపై ముందుగానే ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని అన్నారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక రహదారి మార్గాలనుపరిశీలిస్తున్నామని, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. వాహనాల పార్కింగ్ సమస్యలు నివారించేందుకు మల్టీ లెవల్ పార్కింగ్ స్థలాలను గుర్తించామని, ప్రైవేట్ వాహనాల నియంత్రణకు డ్రాప్ గేట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.రాష్ట్ర ధార్మిక సలహాదారు గోవింద హరి మాట్లాడుతూసరస్వతి అంత్య పుష్కరాలను ఆది పుష్కరాల మాదిరిగానే అత్యంత వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అంత్యపుష్కరాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న దేవాదాయ శాఖ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం క్షేత్రానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేలా త్వరలోనే “కాళేశ్వర ఖండం” అనే పుస్తకాన్ని విడుదల చేస్తామని తెలిపారు. పీఠాధిపతులు, హారతి, ఇతర తాత్కాలిక ఏర్పాట్ల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. అంత్యపుష్కరాలకు వచ్చే భక్తులకు గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ మాయం సింగ్, డిఎస్పీ సూర్యనారాయణ, ఆలయ ఈఓ మహేష్, సిఐ వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ రవీంద్రనాథ్, తహసీల్దార్ రామారావు,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- -63 మంది లబ్ధిదారులకు 18,12,000 రూపాయల విలువైన చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే..
- -కొడవటంచ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు.. -ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేసిన ఎమ్మెల్యే



**రేగొండ జనవరి 14( డిడి 9 వార్త )**

భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో కొత్తపల్లిగోరి, రేగొండ మండలాల్లోని లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం నాడు ఎమ్మెల్యే సత్యనారాయణ రావు అందజేశారు.ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 63 మంది లబ్ధిదారులకు 18,12,000 రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు తక్షణ సహాయం అందించడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ సహాయం అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాను నిరంతరం కృషి చేస్తానని, రేగొండ మండల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో బోగి పర్వదినం సందర్భంగా కొత్తపల్లి(బి) గ్రామానికి చెందిన క్యాతం ఐలయ్య వసంత ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా, ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో జరిగిన ముగ్గుల పోటీల్లో పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గులు మన సంస్కృతి, సంప్రదాయాలకు మహిళల సృజనాత్మకతను ప్రతిబింబించే కళారూపమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా మన సంప్రదాయాలు భావి తరాలకు చేరుతాయని పేర్కొన్నారు. గ్రామాల్లో మహిళల భాగస్వామ్యంతో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు మరింత విస్తరించాలన్నారు.


# అగ్నికి ఆహుతైన కేన్ ప్రాంతంలో హృదయ విదారక పరిస్థితులు

**డీ డీ 9 వార్త, ములుగు బ్యూరో :**

ఈనెల 12వ తేదీన రామప్ప పాలంపేట గ్రామ శివారులో గల 53 ఎకరాలలో విస్తరించియున్న కేన్ రక్షిత ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదం వల్ల జరిగిన నష్టం అంతాఇంతా కాదని, దానిని పూడ్చడం చాలా కష్టం అని వృక్ష శాస్త్రవేత్త డా. సుతారి సతీష్ అన్నారు. ఈ రోజు (14.01.2026) సైట్ చూడడానికి పరిశోధక బృందంతో వచ్చిన ఆయన అగ్నికి ఆహుతైన కేన్ ప్రాంతంను పూర్తిగా పరిశీలించి చాలా ఆవేదనను వెలిబుచ్చారు. పైకి చూడడానికి ఏదో అగ్ని ప్రమాదం లా కనబడుతున్నా, అది స్వార్థప్రయోజనాల కోసం కొంతమంది కలిసి మూకుమ్మడిగా రక్షిత ప్రాంతానికి చేసిన తీవ్ర నష్టం అని అన్నారు. చాలా తడిగా ఉన్న ప్రాంతంలో అంత ఉవ్వెత్తున మంటలు ఒకేసారి వ్యాప్తి చెందడానికి అవకాశం తక్కువ అని, ముందస్తు ప్రణాళిక తో స్థలాన్ని కబ్జా కోరల్లోకి తీసుకెళ్లడానికి అగ్నిని తొందరగా వ్యాప్తి చేసే, మంటల తీవ్రతను పెంచే పదార్థాలని అధునాతన పరికరాలు ఉపయోగించి ఆ ప్రాంతమంతా చల్లి, తర్వాత నిప్పు అంటించడం జరిగిందని అనుమానం వ్యక్తం చేశారు, దాని ద్వారానే మంటలు అంత తీవ్రంగా వ్యాప్తిచెంది, కేన్ రక్షిత ప్రాంతంలో ఉన్న జీవవైవిధ్యాన్ని పూర్తిగా భస్మం చేశాయని తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. సమయానికి ఫైర్ సిబ్బంది, అటవీ సిబ్బంది, రెవిన్యూ, పోలీస్ సిబ్బంది చేరుకొని నష్ట తీవ్రతను తగ్గించినా, జరగాల్సిన నష్టం జరిగిపోయిందని వాపోయారు. సుమారు ఎకరం విస్తీర్ణంలో కేన్ మొక్కలు, వాటికి అనుబంధంగా ఉన్న మందు మొక్కలు, 1 తానిక్కాయ, 2 తాటి చెట్లు, 6 దుండిలమ్, 1 తురాయి, 6 పచ్చారు, 1 టేకు, 1 బుడదర్మి చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయని, అగ్నికి ఆహుతైన ప్రాంతం లో మంటల దాటికి చనిపోయిన కౌజు పిట్టల మాంసపు ముద్దలు, కాలిపోయిన గుడ్ల పొచ్చులు, నత్తగుల్లలు, వంటి వాటితో చాలా హృదయ విదారక పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపారు. కేన్ ప్రాంతమును గత రెండు దశాబ్దాల నుండి ప్రత్యక్షంగా చూడడం జరుగుతుందని, ఇంత స్థాయిలో నష్టం ఎప్పుడూ జరగలేదని వాపోయారు. దీనికి తోడు ఈ మధ్యకాలంలో చెత్త వేయడం, మృతదేహాలను పూడ్చిపెట్టడం లాంటివి చేస్తూ, అరుదైన కేన్ రక్షిత ప్రాంతం ను నామరూపాలు లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఇట్టి అన్ని సంఘటనలపై, సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. అటవీ అధికారులు ఇప్పటికైనా ఈ ప్రాంతంపై దృష్టిసారించి, శాశ్వత ప్రాతిపదికన కేన్ ప్రాంతం చుట్టూ కందకంతో పాటు, చైన్ లింక్డ్ ఫెన్సింగ్ ఏర్పాటు వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. కేన్ రక్షిత ప్రాంతాన్ని పరిశీలించిన వారిలో ఎమ్. నాగరాజు, శ్రీనివాస్, మధు, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.









# వైభవంగా శ్రీ గోదా రంగనాథ స్వామి కళ్యాణహోత్సవం

**డిడి 9 వార్త మహబూబాబాద్ జిల్లా బ్యూరో (గార్ల) జనవరి 14:**

గార్ల మండల కేంద్రంలోని శ్రీ వేట వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ గోదా రంగనాథ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అచ్యుతాచార్యులు మాట్లాడుతూ, గోదాదేవి కళ్యాణాన్ని వీక్షిస్తే ఎన్నో జన్మల పుణ్యమని పేర్కొన్నారు .విశేష పూల అలంకరణతో, పట్టు వస్త్రాలతో అలంకరించిన గోదా రంగనాథ స్వాములు భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో గార్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పార్వతి హతీరం నాయక్ పాల్గొన్నారు.

# తండ్రి జ్ఞాపకార్థం గ్రామ పంచాయతీ సిబ్బందికి సంక్రాంతి కానుకలు

**డిడి 9 వార్త మహబూబాబాద్ జిల్లా బ్యూరో (బయ్యారం) జనవరి 14:**



బయ్యారం మండల సిపిఎం సీనియర్ నాయకులు కత్తి సత్యం జ్ఞాపకార్థం వారి కుమారుడు ఐదవ వార్డు సభ్యుడు కత్తి రమేష్ రాజా బయ్యారం గ్రామ పంచాయతీ పారిశుధ్యకార్మికులకు,సిబ్బందికి సంక్రాంతి పండుగ సందర్బంగా కానుకలు అందించారు.ఈ కార్యక్రమంలో మూడో వార్డు సభ్యులు వార్డు సభ్యులు వల్లాల కల్పన,సిపిఎం నాయకులు అంగిరేకుల నాగేశ్వరరావు,వల్లాల వెంకన్న నలమాస సతీష్,బసవ వెంకటేశ్వర్లు, కత్తి సూర్యనారాయణ,మొరంపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మంథని మండల ముకాస యువత అధ్యక్షుడిగా దండే రాకేష్ ఎన్నిక

**మంథని, జనవరి 14(డిడి 9 వార్త);**

బుధవారం మంథనిలో రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షలు బండి సంజీవ్,జిల్లా అధ్యక్షులు తొగరి సురేష్ ఆదేశాలతో మంథని మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బుద్దార్థి సత్యనారాయణ ఆద్వర్యంలో మున్నూరు కాపు సంఘం యూత్ అధ్యక్షున్నిగా దండే రాకేష్ ను ఎకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమములో ముకాస మండల అధ్యక్షులు మాట్లాడుతూ...మున్నూరు కాపు రైతుల సమస్యలపై,విద్యార్థుల సమస్యలపై, బిసి రిజర్వేషన్ల కోసం పోరాడి మన సమస్యలను ముందుండి పరిస్కరించే దిశగా పనిచేయలని నూతనంగా ఎన్నికైన యూత్ కమిటికి దిశనిర్దేశం చేశారు.ఈకార్యక్రమములో ఎక్లాస్ పూర్ సర్పంచ్ బొడ్డు రజిత శ్రీనివాస్,ఈసంపెల్లి ప్రసాద్,కాసర్ల శ్రీనివాస్,భద్రపు శ్రీనివాస్,రావుల స్వామి,బుద్దార్థి లక్షణ్,బండి శంకర్,నరేష్,ఎడ్ల తిరుపతి,చిగురు రాములు,రాజు మున్నూరు కాపు సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.





## గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు యువకుల అరెస్ట్: సిఐ

**డిడి 9 వార్త మహబూబాబాద్ జిల్లా బ్యూరో జనవరి 14:**

గంజాయినీ అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మహబూబాబాద్ టౌన్ సిఐ మహేందర్ రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు: మహబూబాబాద్ ఆర్టీసీ బస్టాండ్ లో తనిఖీలు నిర్వహిస్తుండగా అక్కడ ఉన్న ఇద్దరు వ్యక్తులు పోలీసు వారిని చూసి పారిపోవడానికి ప్రయత్నిచగా వారిని అదుపులో తీసుకుని వారి వద్ద ఉన్న బ్యాగులు తనిఖీ చేయగా నిషేధిత గంజాయి ఉన్నట్లు గుర్తించామని అన్నారు. వారి వివరాలు తెలుసుకోగా పెద్దపల్లి జిల్లా రాఘవపూర్ గ్రామానికి చెందిన కటుకూరి వేణు ,పోలవేని అనిల్ అని వారు తెలిపినట్లు సిఐ పేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు 5 లక్షల విలువగల 8 కిలోల ఎండు గంజాయి ప్యాకెట్లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించినట్లు సీఐ తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, మత్తు పదార్థాల అక్రమ వ్యాపారంలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.




## ఆర్ఎఫ్‌సిఎల్ అయ్యప్ప స్వామి సేవకు సహకరించిన భక్తులకు కృతజ్ఞతలు

- **దీక్షా కాలం నుంచి మకరవిల్లక్కు వరకు సేవలందించిన దాతలకు ఆలయ కమిటీ ధన్యవాదాలు**

**పెద్దపల్లి బ్యూరో, జనవరి 14 (డిడి9 వార్త):**

ఫర్టిలైజర్ సిటీ లోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయానికి దీక్షా కాలం ప్రారంభమైన నవంబర్ నెల నుంచి మకరవిల్లక్కు వరకు (జనవరి-14) వివిధ రూపాల్లో సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు బయ్యాపు ప్రభంజన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..., దీక్షా కాలం మొత్తం అన్నప్రసాదం, అల్పాహారం, పూజలు, అభిషేకాలు, పడి పూజలు, రథోత్సవాలు, మండల పూజ, ఇతర పూజా సామాగ్రి కోసం వస్తు రూపేణా, ధన రూపేణా సహకరించిన స్వాములు, దాతలు, అలాగే వాటర్, పెరుగు, పూలు, బియ్యం, ఆలుగడ్డలు అందించిన దాతలు, సౌండ్ సిస్టం, టెంట్ హౌస్ నిర్వాహకులు మరియు భక్తిశ్రద్ధలతో సేవలందించిన ప్రతి ఒక్కరికి కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యగార్లు కర్నె. అశోక్ శర్మ, మురళీధర్ శర్మ, ఆలయ గురు స్వామి ఆడెపు లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ..., సహకరించిన ప్రతి ఒక్కరిపై శ్రీ అయ్యప్ప స్వామి ఆశీర్వాదాలు, అనుగ్రహం కలగాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు.



# భోగి–సంక్రాంతి పండుగ శోభ..

**మంథని, జనవరి 14 (డిడి 9 వార్త):**

భోగి-సంక్రాంతి పండుగలు మంథని నియోజకవర్గంలో ఆనందం, ఆధ్యాత్మికత, సంప్రదాయాల నడుమ ఘనంగా కొనసాగుతున్నాయి. గ్రామాలు, పట్టణాలు అన్నీ పండుగ వాతావరణంతో కళకళలాడుతున్నాయి. ప్రతి ఇంట్లో భోగి మంటలు, ముగ్గుల అలంకరణలు, పూజలు, కుటుంబ సమేతంగా పండుగ వేడుకలు జరుపుకుంటూ ప్రజలు సంబరాల్లో మునిగిపోయారు.

భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామునే భోగి మంటలు వెలిగించి, పాత దుర్గుణాలను విడిచిపెట్టి కొత్త ఆశయాలతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ప్రజలు పూజలు నిర్వహించారు. మహిళలు ఇంటి ముందు అందమైన రంగవల్లులు వేసి, గొబ్బెమ్మలతో సంక్రాంతి శోభను పెంచారు. పిల్లలు కొత్త



దుస్తులు ధరించి గాలిపటాలు ఎగరవేస్తూ పండుగ ఆనందాన్ని ఆస్వాదించారు. ఈ సందర్భంగా మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రజలకు భోగి-సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రైతుల కష్టానికి ప్రతిఫలంగా వచ్చే పండుగే సంక్రాంతి అని పేర్కొన్న మంత్రి, పంటలు పండించి రాష్ట్రానికి అన్నం పెట్టే రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. మంథని నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే రైతులు, కార్మికులు, యువత, మహిళలు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామాలవారీగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కొన్ని చోట్ల హరిదాసు సంకీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, జానపద కళారూపాలు పండుగకు మరింత శోభను చేకూర్చాయి. యువత కబడ్డీ, వాలీబాల్, కోడి పందేలు వంటి సంప్రదాయ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణ ప్రాంతాల్లో వ్యాపారాలు జోరుగా సాగాయి. పండుగ కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి. పల్లె ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒకచోట చేరి పండుగ భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. వలస వెళ్లిన వారు స్వగ్రామాలకు చేరడంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

మొత్తంగా భోగి-సంక్రాంతి పండుగలు మంథని నియోజకవర్గంలో ఐక్యత, సంప్రదాయం, ఆనందానికి ప్రతీకగా నిలుస్తూ ప్రజల హృదయాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ప్రజలందరి జీవితాల్లో సుఖ సంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని కోరుకుంటూ పండుగ వేడుకలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి.

## గోదావరిఖని కిరాణం మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి పండగ సంబురాలు

**డిడి9వార్త / రామగుండం జనవరి 15:**

ఈరోజు స్థానిక కళ్యాణ్ నగర్ గోదావరిఖని కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి మంటల కార్యక్రమం నిర్వహించారు ఎందరో మాట్లాడుతూ.. అనంతరం వారు మాట్లాడుతూ..భోగి అంటే త్యాగం. పాత పనికిరాని వస్తువులను భోగి మంటల్లో వేసి, కొత్త జీవన ప్రయాణానికి శ్రీకారం చుట్టడం ఈ పండుగ అసలు ఉద్దేశం. చలికాలం చివరి దశలో అగ్ని చుట్టూ చేరి వేడి పొందడం ఆరోగ్యపరంగానూ ప్రయోజనకరం. అలాగే సూర్యుడు ఉత్తరాయణంలోకి ప్రవేశించే ముందు రోజు కావడంతో, ప్రకృతికి కృతజ్ఞత తెలుపుకునే పండుగగా భోగి నిలుస్తుంది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు చొక్కారపు వెంకటేశ్వర్లు, చిట్టిమల్ల కిషోర్, రేణిగుంట చందర్, నగునూరి సత్య ప్రసాద్, రావికంటి శశిధర్, గడ్డం సత్యనారాయణ, రామిడి నవీన్, రవికంటి విజయ్, మరియు మహిళలు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.



## ఏపీకి తరలివెళ్తున్న తెలంగాణ యువత...
# కోడిపందాల వీక్షణకు ప్రత్యేక ప్రయాణాలు

**మంథని, జనవరి 14 (డిడి 9 వార్త):**

సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగే కోడిపందాల పోటీలను వీక్షించేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో యువకులు, క్రీడాభిమానులు అక్కడికి వెళ్లి వస్తున్నారు. ఏపీ పల్లెల్లో జరిగే సంప్రదాయ సంక్రాంతి సంబరాలు, కోడిపందాల బరులు, ఆటపాటలు తమను ఆకర్షిస్తున్నాయని పలువురు చెబుతున్నారు. ప్రత్యేకంగా ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు తదితర ప్రాంతాల్లో సంక్రాంతి వేళ జరిగే కోడిపందాల పోటీలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. వీటిని ప్రత్యక్షంగా తిలకించేందుకు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి యువకులు వాహనాలపై గుంపులుగా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తున్నారు.



కొందరు వీక్షకులుగా మాత్రమే పాల్గొనగా, మరికొందరు పండుగ వాతావరణాన్ని ఆస్వాదించేందుకు వెళ్లినట్లు తెలుస్తోంది. కోడిపందాలతో పాటు గాలిపటాల పోటీలు, గ్రామీణ క్రీడలు, జానపద కళారూపాలు, పండుగ సందడి తెలంగాణ నుంచి వెళ్లిన సందర్శకులను మరింత ఆకట్టుకుంటున్నాయి. పల్లె వాతావరణం, సంప్రదాయ భోజనాలు, ఉత్సవ శోభ ప్రత్యేక అనుభూతినిస్తోందని వారు అభిప్రాయపడుతున్నారు. సంక్రాంతి రోజుల్లో తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య రహదారులపై వాహనాల రద్దీ పెరిగింది. బస్సు స్టేషన్లు, ప్రధాన రహదారుల్లో ప్రయాణికుల సంఖ్య అధికంగా కనిపిస్తోంది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రవాణా, పోలీస్ శాఖలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి.

# పల్లెలో సందడిగా గ్రామీణ క్రీడలు

- **బోగిమంటలతో యువత కేరింతలు**

**డిడి9 వార్త జనవరి14 కారేపల్లి :**
సంక్రాంతి సందర్భంగా పల్లెలో గ్రామీణ క్రీడలు సందడిరగా సాగాయి. కారేపల్లి మండలం ఎర్రబోడు, వెంకిట్యా తండా, టేకులగూడెంలో స్త్రీ, పురుషులకు వివిధ పోటీలను నిర్వహించారు. తాడులాగుడు పోటీలు అలరించాయి. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు తమ గ్రామాలల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రముఖ న్యాయవాధి నర్సింగ్ శ్రీనివాసరావు తన తల్లిదండ్రులు జ్ఞాపకార్ధం ఎర్రబోడులో గ్రామీణ క్రీడలు, డాన్స్, ముగ్గుల పోటీలను నిర్వహించారు. వెంకిట్యాతండాలో సర్పంచ్ బానోత్ భూలి, మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లానాయక్ ఆధ్వర్యంలో యువకులకు వాలిబాల్, తాడులాగుడు పోటీలను నిర్వహించారు. టేకులగూడెంలో సర్పంచ్ గుమ్మడి సందీఫ్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య చేతుల మీదిగా బహుమతులు అందజేశారు.

బోగిమంటలతో యువత కేరింతలు

బోగి పండుగను పురష్కరించుకోని బుధవారం తెల్లవారుజామున గ్రామాల్లో బోగి మంటలు వేసి దాని చుట్టు తిరుగుతూ నృత్యా చేశారు. విశ్వనాధపల్లిలో సహకుటుంబ సమేత వాట్సప్ గ్రూపు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామీణ క్రీడలతో అలరిస్తున్నారు. 20 కుటుంబాల వారు ఒక్క దగ్గర చేరి పండుగను జరుపుకోవటంతో వారిని గ్రామస్తులు ఆసక్తిగా గమనిస్తున్నారు.





# అంగరంగ వైభవంగా గుడిమెలిగే పండుగ

- **మేడారం మహాజాతర ప్రధాన ఘట్టానికి శ్రీకారం**
- **డోలు వాయిద్యాలతో సమ్మక్క పూజారి గుడికి**
- **సమ్మక్క గుడి శుద్ధి – మంచినీటితో పవిత్రీకరణ**
- **అడవిలోని పుట్టమట్టి గుడిలో పోసిన పూజారులు**
- **ఎర్రమట్టితో అమ్మవారి గద్దె వద్ద ముగ్గులు**
- **మహిళలతో శోభిల్లిన సమ్మక్క గుడి ఆవరణ**
- **సమ్మక్క దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు**



**ఏటూరునాగారం క్రైం, జనవరి 14,(డిడి9 వార్త):**
మేడారం మహాజాతర సమీపిస్తున్న వేళ, పూజారులు పూజా కార్యక్రమాలకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో బుధవారం మేడారంలోని సమ్మక్క గుడిమెలిగే పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ముందుగా సమ్మక్క గుడిని మంచి నీటితో శుద్ధి చేసి, దేవతా సామగ్రిని పరిశుభ్రం చేశారు. అనంతరం అడవిలోని పుట్టమట్టిని గ్రామ పెద్దలు, పూజారులు తీసుకువచ్చి గుడిలో పోశారు. మహిళలు ఆ ఎర్రమట్టితో అమ్మవారి గద్దె వద్ద అందమైన ముగ్గులు వేసి గుడి ఆవరణను అలంకరించారు.

**డోలు వాయిద్యాలతో సమ్మక్క దేవత గుడికి**


సమ్మక్క ప్రధాన పూజారి ఇంటి నుంచి డోలు, వాయిద్యాల మధ్య ఊరేగింపుగా గుడికి చేరుకున్నారు. అనంతరం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవతకు మొక్కులు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సమ్మక్క గుడిలో పూజారులు అటుక్కు, జనపనారాలతో హారతులు ఇచ్చారు. గుట్టగడ్డికి అవసరమైన గడ్డిని గ్రామస్తులు, పెద్దలు కలిసి తీసుకువచ్చి గుడిపై కప్పారు. పురాతన కాలంలో గడ్డిగుడిసెను అలంకరించిన సంప్రదాయాన్ని తిరిగి ఆచరణలోకి తీసుకువచ్చారు.

**ప్రధాన ఘట్టానికి ప్రారంభం**

గుడిమెలిగే పండుగతో మహాజాతర ప్రధాన ఘట్టం ప్రారంభమైందని పూజారుల సంఘం అధ్యక్షుడు జెగ్గారావు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఈ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. సమ్మక్క గుడి ఆవరణలో మహిళలు రంగురంగుల ముగ్గులతో ప్రత్యేక అలంకరణ చేపట్టారు. మేడారంలోని పూజారుల వంశస్తులు స్వయంగా పాల్గొని గుడిని శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో పూజారులు మునేందర్, కృష్ణయ్య, రాణారమేష్, స్వామి, వసంతరావు, బోజారావు, జనార్దన్, కుర్సం రవి, బొక్కెన్న, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.







# బయ్యారం లో కమణీయంగా గోదాదేవి రంగనాథుల కళ్యాణం

**డిడి 9 వార్త మహబూబాబాద్ జిల్లా బ్యూరో (బయ్యారం) జనవరి 14:**
బయ్యారం కోదండరామాలయంలో భోగి పండగను పురస్కరించుకుని గోదారంగనాథుని కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. నెలరోజుల పాటు ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గోదాదేవి అందించిన తిరుప్పావైని పఠనం చేస్తూ చివరి రోజైన భోగి పండగ రోజున అమ్మవారు స్వామిని వివాహం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శన చార్యులు ఘనంగా నిర్వహించారు. పాడిపంటలతో చల్లగా ఉండాలని ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకుంటూ అమ్మవారి కల్యాణాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో

ఆలయ కమిటీ చైర్మన్ గాదె కృష్ణారెడ్డి,

సెక్రటరీ కొల్ల వెంకటేశ్వరరావు ,ఆలయ ఇన్చార్జి పెద్దినేని వెంకటేశ్వరరావు,

వైయస్ రెడ్డి,

గరిపెల్లి శ్రీనివాస్,

పుసులూరి మాధవరావు,

వేంశెట్టి కోటేశ్వరరావు,

చల్లగుండ్ల వెంకటనారాయణ, చల్లగుండ్ల ఉప్పలయ్య,ఇస్లావత్ నరేష్,దూదిపాల రాజేషు,యార్లగడ్డ హనుమంతు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



# ఫోటోరైటఫ్(14కేఆర్‌పీ2) నివాళ్లు అర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- **బాధితులకు బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శ**

**డిడి9 వార్త జనవరి14 కారేపల్లి :**
కారేపల్లి మండలం మంగళ తండాకు బీఆర్‌ఎస్ నాయకులు పిల్లలమర్రి వెంకటేశ్ నాయనమ్మ అనసూర్య ఇటివల మృతి చెందింది. బుధవారం జరిగిన ఆన సూర్య సంస్మరణ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నాయకులు కొత్తతండా సర్పంచ్ దారావత్ మంగీలాల్, మలిదశ ఉద్యకారులు సోమందుల నాగరాజు హాజరై మృతిరాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బర్మావత్ కోటి తదితరులు ఉన్నారు.



# ఆర్ జి 3,,జిఎం సుంకరి మధుసూదన్ కు ఘన సన్మానం

**మంథని, జనవరి 14 (డిడి 9 వార్త)**

సింగరేణి ఆర్జీ 3 జిఎం సుంకరి మధుసూదన్ కు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం పక్షాన ఘన సన్మానం జరిగింది, ఇటీవలే ఆర్జీ 3 జనరల్ మేనేజర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్, ను బుధవారం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు,పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపి, శాలువులతో ఘనంగా సన్మానించి స్వీట్స్ తిని పించారు, మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు, జనరల్ మేనేజర్ సన్మానించిన వారిలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కొంకటి లక్ష్మణ్, ఆలయ ఫౌండేషన్ సీఈవో మిట్టపల్లి రాజేంద్రకుమార్, సీనియర్ జర్నలిస్టు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ , బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైసా రాజేష్, సిఐటియు నాయకులు నరహరిరావు , కొంకటి సిద్ధార్థ,తదితరులు ఉన్నారు.




# సంప్రదాయాలను భావితరాలకు అందించాలి మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య

- **టేకులగూడెంలో సంక్రాంతి క్రీడలు**

**డిడి9 వార్త జనవరి14 కారేపల్లి :**

సాంస్కృతి, సంప్రదాయలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పోటు రంగారావులు అన్నారు. కారేపల్లి మండలం టేకులగూడెంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్, పీవైఎల్, పీవోడబ్ల్యు, పీడీఎస్‌యు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, యువతకు క్రికెట్, వాలీబాల్ తో పాటు పలు రకాల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.ఈసంధర్బంగా సర్పంచ్ గుమ్మడి సందీప్ అధ్యక్షతన జరిగిన సభలో గుమ్మడి నర్సయ్య, పోటు రంగారావులు మాట్లాడుతూ తెలుగు పండుగలు మన సాంప్రదాయానికి ప్రతీకలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు మన పండుగల యొక్క విశిష్టతను వివరించాలని వారు కోరారు. ఈకార్యక్రమంలోఉప సర్పంచ్ బిక్కసాని భాస్కర్, ప్రజాసంఘాల నాయకులు చంద్ర అరుణ, గుమ్మడి అనురాధ, గోకినపల్లి లలిత, సత్తిరెడ్డి, కోయ్యల శ్రీను, బాలు, పఅద్వి, రాకేష్, మోహన్‌రావు, సక్రు, వేములపల్లి వీరన్న, అనసూర్య, రంగ్య, మొగిలి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో ఐక్య పోరాటాలకు పదును

## – సీఐటీయూ 17వ రాష్ట్ర మహాసభల పిలుపు

- **భోగి సంక్రాంతి శుభాకాంక్షలతో గోడపోస్టర్ ఆవిష్కరణ... కార్మిక హక్కులపై పోరాటం తప్పదన్న మెండె శ్రీనివాస్**



**పెద్దపల్లి బ్యూరో, జనవరి 14 (డిడి9 వార్త):**

సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర 17వ మహాసభలు 2026 జనవరి 17, 18 తేదీల్లో మందమర్రి ఏరియాలో జరగనున్న నేపథ్యంలో ఆర్జీవన్ ఏరియాలో గోడ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మిక సోదరీ-సోదరులకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్జీవన్ ఏరియా వర్క్ షాప్, ఓసీపీ-5, జీడీకే-11, 2 ఇంక్లైన్ ప్రాంతాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్జీవన్ కార్యదర్శి మెండె శ్రీనివాస్ మాట్లాడుతూ..., "ఐక్యతే మా నినాదం. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలను మరింత బలపరుస్తాం" అని స్పష్టం చేశారు. రానున్న రాష్ట్ర మహాసభల్లో కార్మిక సమస్యలపై విస్తృత చర్చలు, కీలక తీర్మానాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విధానాలు, యాజమాన్య చర్యల వల్ల కార్మిక సంఘాల ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. కార్మికుల శ్రమ వల్లే సంస్థలు కొనసాగుతున్నాయని, కార్మికులు లేకుండా యాజమాన్యాలు ఉండలేవని గుర్తు చేశారు. గెలిచిన సంఘాలు ఒప్పందాలపై యాజమాన్యం సర్క్యులర్లు ఇవ్వకపోవడం సరికాదని అన్నారు. కొత్తగా తీసుకొచ్చిన 150 మస్టర్ల నిబంధన సర్క్యులర్ కారణంగా పలువురు కార్మికులకు ఇంక్రిమెంట్ల కటింగ్, డిస్మిస్ లెటర్లు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి ఓడి మస్టర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల దీర్ఘకాలిక సమస్యలైన అలవెన్సులు, ఐటీ మాఫీ, స్వంతింటి కల, మారుపేర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే ఎన్నికల్లో తగిన బంగపాటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీవన్ అధ్యక్షుడు ఆరెపల్లి రాజమౌళి, ఆనబోయిన శంకరన్న, పుప్పాల శ్రీనివాస్, పెండ్యం సమ్మయ్య, సీఏచ్ లక్ష్మణ్, బి. భీమా నాయక్, జంగాపల్లి మల్లేష్, పోలేటి నరేష్, నంది నారాయణ, బాదే రవి, బొద్దుల ఓదెలు, సంతోష్, బొడ్డుపల్లి రవి, ఈద వెంకటేశ్వర్లు తదితర నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# ప్రజలకు పారదర్శక సేవలు అందాలి

**భూపాలపల్లి జనవరి 14 ( డిడి 9 వార్త )**



పోలీస్ స్టేషన్ లకు వచ్చే ప్రజలకు పారదర్శక మైన సేవలు అందించాలని ఎస్పీ సంకిర్త్ అన్నారు. బుధవారం నాడు ఆయన జిల్లాలోని పలిమెల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందే ఉద్దేశంతో ఆయన పలిమెల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణం, పరిసరాల శుభ్రత, సిబ్బంది విధి నిర్వహణ విధానం తదితర అంశాలను ఎస్పీ సమగ్రంగా పరిశీలించారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు స్నేహపూర్వక వాతావరణం కల్పించడంతో పాటు, త్వరిత న్యాయం, పారదర్శక సేవలు అందేలా ప్రతి పోలీస్ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా విధులు నిర్వహించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన ఈ అన్నారు. ఎస్పీ వెంట కాటారం డిఎస్పీ సూర్య నారాయణ, సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేష్‌లు ఉన్నారు.

# కోల్ ఇండియా పోటీలకు సింగరేణి కళాకారుల ప్రయాణం

- **ఎంపికైన కళాకారులకు ఆత్మీయ వీడ్కోలు పలికిన ఏఐటీయూసీ నేతలు**



**పెద్దపల్లి బ్యూరో, జనవరి 14 (డిడి9 వార్త):**

కోల్ ఇండియా స్థాయి సాంస్కృతిక పోటీల్లో పాల్గొనడానికి ప్రయాణమవుతున్న ఆర్జీ-1, ఆర్జీ-2 సింగరేణి కళాకారులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం బుధవారం గోదావరిఖని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ కవ్వంపల్లి స్వామి, ఏరియా సూపర్‌వైజర్ హనుమాన్ దాస్ రమేష్, సీనియర్ కళాకారుడు కాసిపాక రాజమౌళి పాల్గొని కళాకారులను అభినందించి వీడ్కోలు పలికారు. ఇటీవల మందమర్రిలో జరిగిన కంపెనీ స్థాయి సాంస్కృతిక పోటీల్లో ప్రథమ బహుమతులు సాధించి కోల్ ఇండియా పోటీలకు ఎంపికైన కళాకారులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. లైట్ సాంగ్ విభాగంలో దార సుశీల, మౌతార్గన్ విభాగంలో ఆదిల్ మొహమ్మద్, కవాలి టీమ్ విభాగంలో సాన జలపతి, పులియాల సతీష్ కుమార్, పొన్నాల శంకర్, నోవా శ్యామ్, కనకం రమణయ్య, రాకేష్, రాజారామ్, ప్రేమ్ కుమార్ ఈ నెల 15 నుంచి డబ్ల్యూసీఎల్ నాగపూర్‌లో జరిగే కోల్ ఇండియా సాంస్కృతిక పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... గతంలో కోల్ ఇండియా సాంస్కృతిక పోటీల్లో సింగరేణి కళాకారులు అనేక బహుమతులు సాధించి సంస్థకు మంచి పేరు తీసుకువచ్చారని, కళాకారులకు మరింత ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తారని పేర్కొన్నారు. అలాగే ఇటీవల మంచిర్యాలలో నిర్వహించిన లఘుచిత్ర పోటీల్లో జ్యూరీ అవార్డు సాధించిన 'అల వృద్ధాశ్రమములో' లఘుచిత్ర నిర్మాత పులియాల సతీష్ కుమార్‌కు, దర్శకుడు చంద్రపాల్‌కు అతిథుల చేతుల మీదుగా అవార్డు మెమొంటోను అందజేశారు. అనంతరం కళాకారులు సీనియర్ కళాకారులు కవ్వంపల్లి స్వామి, కాసిపాక రాజమౌళిలను శాలువాలతో సత్కరించారు.

# బోగి మంటల్లో కాంగ్రెస్ 420 హామీలు

- మోసపూరిత పాలనకు చరమగీతం పాడాలి
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**పెద్దపల్లి బ్యూరో, జనవరి 14 (డిడి9 వార్త):**
కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం, అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను నట్టేట ముంచడమే వారి నైజమని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ తీవ్రంగా విమర్శించారు. మోసపూరిత కాంగ్రెస్ పార్టీ పాలనకు చరమగీతం పాడాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

బుధవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో భోగి పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల పత్రాలను బోగి మంటల్లో వేసి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కోరుకంటి చందర్ వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..., కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేస్తే ప్రజలను అరిగోస పెట్టడం తప్ప మరో ప్రయోజనం లేదన్నారు.

కేసీఆర్ గారి పదేళ్ల పాలనలో రైతు రాజ్యం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేసిందని, రైతుబంధు, రైతుబీమా, సకాలంలో ఎరువుల సరఫరా, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలతో రైతుల కళ్లలో ఆనందం నింపారని గుర్తు చేశారు. అయితే రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రైతాంగానికి కన్నీళ్లే మిగిలాయని, యూరియా కోసం రోజులు తరబడి దుకాణాల ముందు ఎదురుచూడాల్సిన దుస్థితి వచ్చిందని మండిపడ్డారు.

రామగుండం ప్రాంతంలో గత రెండేళ్లుగా కమిషన్లు, కూల్చివేతలతో చిరు వ్యాపారులను రోడ్డున పడేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి మాత్రం చేయలేదని విమర్శించారు. రైతులను, వ్యాపారులను, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన ఘనత రేవంత్ సర్కార్‌కే దక్కుతుందని అన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్ మోసపూరిత పాలనకు గుణపాఠం చెప్పి బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలవాలని కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాముకుంట్ల భాస్కర్, జనగామ కవిత సరోజిని, నారాయణ దాసు మారుతి, దొమ్మేటి వాసు, జక్కుల తిరుపతి, బుర్రి వెంకటేష్, నీరటి శ్రీనివాస్, సంహచలం రత్నాకర్, జిట్టవేన ప్రశాంత్, సట్టు శ్రీనివాస్, ఇరుగురాళ్ల శ్రావన్ చింటూ, కొడి రామకృష్ణ, బొంతల భాను ప్రసాద్, ఆవునూరి వెంకటేష్, కనకరాజ్, పవన్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.





# గోదాదేవి రంగనాయక స్వామి కళ్యాణం నిర్వహించిన- రంగనేని వంశస్థులు

- పూర్వం నుండి రామాచారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది- గ్రామ ప్రజలు

**పెద్దపల్లి జిల్లా, (డి డి 09 వార్త) జనవరి 14**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం లింగాపూర్ గ్రామం  గ్రామం శ్రీ గోదాదేవిరంగనాయక స్వామి కళ్యాణం అంగరంగవైభవంగా జరిగింది.
ప్రతి సంవత్సరం ధనుర్మాసంలో నెల రోజులుగా వ్రతం చేసి బోగీ రోజు న కళ్యాణం చేసి ఊరంతా నపండుగల జరుపుకొంటుంది.

ఈ ఉత్సవం గత 74సంవత్సరాలుగా అర్చకులు సేనాపతి రామాచారి ఆధ్వర్యంలో రంగినేని వంశస్తులు, లింగాపూర్ గ్రామ ప్రజలు రంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.కళ్యాణం అనంతరం భక్తులు స్వామి వారి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి భోజనాలు చెస్తారు.ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు, తదితరుల వికసంకలు పాల్గొన్నారు.

# సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సమత్ బట్టుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్,ఉప సర్పంచ్

**కరకగూడెం, జనవరి 14 (డి డి 9 వార్త)**

కరకగూడెం, మండలం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సమత్ బట్టుపల్లి గ్రామపంచాయతీ, సర్పంచ్ కొమరం సత్యనారాయణ, ఉప సర్పంచ్ పోలిబోయిన శంకరయ్య గ్రామపంచాయతీ ప్రజలకు హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ అయిన సంక్రాంతి రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, కష్టపడి సాగు చేసిన పంటలకు మంచి ధరలు లభించాలని వారు ఆకాంక్షించారు. ఈ పండుగ ప్రతి ఇంట్లో సుఖశాంతులు, ఆరోగ్యం, ఆనందం నింపాలని, కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు మరింత బలపడాలని కోరారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సంక్రాంతి వేడుకలను ప్రజలందరూ కలిసిమెలిసి ఆనందంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధిలో ప్రజల సహకారం అత్యంత కీలకమని పేర్కొంటూ, రానున్న రోజుల్లో గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని సర్పంచ్, ఉప సర్పంచ్ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా గ్రామ ప్రజలందరికీ శుభఫలితాలు కలగాలని, పిల్లాపాపలతో ప్రతి ఇల్లు సంతోషంతో కళకళలాడాలని వారు ఆకాంక్షించారు. ఈ పండుగ కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలకు నాంది కావాలని వారు తెలిపారు...





# శ్రీ చెన్న పర్వతాల మల్లన్న స్వామి దేవాలయంలోబోనాల వేడుకలు

**మంథని, జనవరి 14 (డిడి 9 వార్త)**

మంథని పట్టణంలోని భగత్‌నగర్‌లోని శ్రీ చెన్న పర్వతాల మల్లన్న స్వామి దేవాలయంలో భక్తులు బుధవారం బోనాల వేడుకలు నిర్వహించారు. ఒగ్గు పూజారులు పసుపు బండారి, డోలు వాయిద్యాల మధ్య శ్రీ మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించగా వార్డులోని మహిళలంతా స్వామి వారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మల్లన్న స్వామి బోనాల సందర్భంగా శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణమంతా సందడిగా మారింది. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయా వార్డులకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించుకోవడంతో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో భగత్‌నగర్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# గీత కార్మికుడి కుటుంబానికి చేయూత

**చిట్యాల జనవరి 14,  (డిడి 9 వార్త )**

చిట్యాల మండలం కేంద్రానికి చెందిన గుర్రపు గట్టయ్య గత మూడు సంవత్సరాల క్రితం తాటి చెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద పడటంతో మంచానికే పరిమితమయ్యాడు. దిక్కుతోచని స్థితిలో కుటుంబం ఉండగా ఆ కుటుంబానికి గౌడ సంఘం ఆధ్వర్యంలో 1,00,000 లక్ష రూపాయలు ప్రకటించి బుధవారం రోజున చిట్యాల గౌడ సొసైటీ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ ఆధ్వరంలో లక్ష రూపాయలు గీతా కార్మికుడు గుర్రపు గట్టాయకు డైరెక్టర్లతో కలిసి లక్ష రూపాయలు నగదు అందజేశారు.ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరం, ఈ ప్రభుత్వంలోని గీత కార్మికులకు సేఫ్టీమోకులు అందించడం జరుగుతుందన్నారు. గట్టయ్య స్థితిగతులపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దృష్టికి తీసుకెళ్లి ఆయనకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తామని లక్ష్మణ్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పెరుమండ్ల రాజు. డైరెక్టర్లు రాజు. బుర్ర రాజు. నరేష్‌గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



# క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించిన గోలివాడ యూత్

**పెద్దపెల్లి జిల్లా,  జనవరి 14 (డిడి 9 వార్తా)**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని యువకులు చెడు అలవాట్లకు, మత్తు పదార్థాలకు ,అలవాటు పడకుండ శారీరకంగా, మానసికంగా ఎదుగుదలకు అలవాటు పడాలని ఉద్దేశంతో ఈ క్రికెట్ టోర్నమెంట్స్ నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగానే గోలివాడ గ్రామ సీనియర్ జట్టు గెలుపొందడం జరిగింది.వారికి నూతన బ్యాట్, షీల్డ్ బహుమతులు ప్రధానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ ఎం డి తాజ్ ఉద్దీన్, పొన్నం హరీష్,యూవకులు పాల్గొన్నారు.



# ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు


- సంక్రాంతి మీ కుటుంబంలో వెలుగులు నింపాలి..
- జాతీయ మాల మహానాడు మండల అధ్యక్షుడు: తోటమల్ల గోపాలరావు




**చర్ల, జనవరి 14 (డిడి 9 వార్త )**
నూతన సంవత్సరంలో మొదటిగా వచ్చే పండుగ సంక్రాంతి ఈ పండుగ ప్రతి ఒక్కరి కుటుంబాల్లో వెలుగులు నింపాలని, అందరూ ఆనందంగా జీవించాలని చర్ల మండల జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు తోటమల్ల గోపాలరావు తెలిపారు. మండలంలోని ప్రజలకు, మాల మహానాడు నాయకులకు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు, మిత్రులకు, రైతు సోదరులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు గోపాలరావు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరు సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాల నడుమ సంక్రాంతి వేడుకలు వైభవంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో ఈ సంక్రాంతి వెలుగులు నింపాలని ఆరోగ్యాన్ని, అష్టైశ్వర్యాలను ఆ భగవంతుడు అందరికీ ప్రసాదించాలని కోరుకున్నారు. మండలంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, అంబరాన్నంటేలా సంక్రాంతి సంబరాలు జరుపుకోవాలని ఆయన తెలిపారు.

## ప్రజా భవన్‌లో మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసిన రాధ TMT యాజమాన్యం

**ఏటూరునాగారం,డిడి 9వార్త:**
హైదరాబాద్ ప్రజా భవన్‌లో తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గౌ. డా. ధనుసరి అనసూయ సీతక్కను రాధ TMT స్టీల్ కంపెనీ యాజమాన్యం బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని శ్రీ సమ్మక్క-సారలమ్మ మేడారం జాతర నేపథ్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ఈ పనుల్లో మంత్రి సీతక్క గారి సేవా కృషి అద్భుతమని ప్రశంసిస్తూ రాధ TMT యాజమాన్యం మంత్రి గారికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. రాధ TMT స్టీల్ కంపెనీ చైర్మన్ సునీల్ సరాఫ్, ఎండీ సుమన్ సరాఫ్ గారి ఆదేశాల మేరకు గత కొన్ని సంవత్సరాలుగా అమ్మవారి సేవలో భాగంగా ప్రతి మేడారం జాతరలో లక్షలాది మంది భక్తులకు ఉచిత మినరల్ డ్రింకింగ్ వాటర్ అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరగనున్న మహా జాతర సందర్భంగా కూడా ఉచిత మినరల్ డ్రింకింగ్ వాటర్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ జనరల్ మేనేజర్ వీరేష్ కుమార్ వెల్లడించారు. మంత్రి సీతక్క గారి సూచనలు, ములుగు జిల్లా ఎస్పీ రామనాథ్ కేకన్ చొరవ, సంబంధిత ప్రభుత్వ అధికారుల సహకారంతో, ములుగు డీలర్ గంగిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాధా TMT రైనో 600+ 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, గత సంవత్సరం కూడా రాధ TMT ఉచిత మినరల్ డ్రింకింగ్ వాటర్ క్యాంపును తన చేతుల మీదుగా ప్రారంభించామని, అది విజయవంతమైందని గుర్తుచేశారు. రాధ TMT కంపెనీ చేస్తున్న సేవలు అభినందనీయమని, అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా వారికి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాధ TMT జనరల్ మేనేజర్ వీరేష్ కుమార్, బ్రాండింగ్ మేనేజర్ నరేష్ గౌడ్, వరంగల్ ఇంచార్జి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# కన్నీళ్లోనూ కాంతి... పేదింటి పెద్ద మనసు

- తండ్రి అకాల మరణంలోనూ ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగు నింపిన బసంత్‌నగర్ కుటుంబం



**పెద్దపల్లి బ్యూరో, జనవరి 14 (డిడి9 వార్త):**
పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లో ఓ నిరుపేద కుటుంబం కన్నీళ్ల మధ్యనూ మానవత్వానికి కొత్త అర్థం చెప్పింది. ఇంటి పెద్దను కోల్పోయిన తీరని విషాదంలోనూ, తమ బాధను పక్కనబెట్టి ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపుతూ నేత్రదానం చేసి సమాజానికి గొప్ప సందేశం ఇచ్చింది. గోదావరిఖనిలో చెప్పులు కుట్టుతూ కుటుంబాన్ని పోషించిన దేవరకొండ ప్రకాష్ (57), అనారోగ్యంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. కష్టాల మధ్యనూ కుటుంబాన్ని నెట్టుకొచ్చిన ప్రకాష్ అకాల మరణం భార్య రమ, కుమారుడు ఉదయ్ ప్రకాష్, కూతుళ్లు మౌనిక-నరేష్, మానస-ప్రభుదాస్‌ను తీవ్రంగా కలిచివేసింది. అయినా... కన్నీళ్లతో నిండిన ఆ ఇంట్లో ఒక గొప్ప నిర్ణయం పుట్టింది. “మనవాడు వెళ్లిపోయినా... ఇంకొకరికి వెలుగు ఇవ్వగలడే” అన్న భావనతో కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. ప్రకాష్ స్నేహితుడు, మాజీ పోలీస్ కానిస్టేబుల్ దేవీ లక్ష్మీనర్సయ్య ఇచ్చిన అవగాహనతో ఈ నిర్ణయం మరింత బలపడింది. హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్ సిబ్బంది సహకారంతో ప్రకాష్ నేత్రాలను విజయవంతంగా దానం చేయగా, ఈ దాతృత్వంతో ఇద్దరు అంధుల జీవితాల్లో చూపు పుట్టనుంది. తండ్రి దేహం కదలకుండా ఉన్నా... ఆయన కళ్లతో ఇద్దరు ప్రపంచాన్ని చూడబోతున్నారు. ఈ మహానుభావ నిర్ణయానికి సదాశయ ఫౌండేషన్, రామగుండం లయన్స్ క్లబ్ ప్రతినిధులు కుటుంబాన్ని అభినందిస్తూ, ప్రకాష్ అకాల మరణం పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. పేదరికం మధ్యనూ పెద్దమనసు ఎలా ఉంటుందో ఈ కుటుంబం చాటిచెప్పింది.

# మినీ మేడారం జాతర ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష..

- అడవి మార్గంలో అమ్మవారు వచ్చే మార్గాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పాయం..



**మణుగూరు. జనవరి 14 (డి డి 9వార్త)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలం తోగూడెం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించనున్న మినీ మేడారం (సమ్మక్క-సారలమ్మ జాతర) కార్యక్రమం సందర్భంగా అమ్మవారు వన ప్రాంతం నుండి గ్రామానికి వచ్చే పవిత్ర మార్గాన్ని స్వయంగా అడవి మార్గంలో వెళ్లి పర్యవేక్షించారు.

అమ్మవారు వచ్చే దారిలో ఉన్న వసతులు, రహదారి పరిస్థితులు, భక్తుల భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అటవీ శాఖ అధికారులు, ప్రభుత్వ అధికారులు, తోగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్, మరియు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి సమీక్ష నిర్వహించారు.

జాతర సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అమ్మవారు వచ్చే దారిలో గ్రావెల్ రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు మరియు సర్పంచ్ గారికి సూచనలు చేశారు. అలాగే గుడి ప్రాంగణంలో పరిశుభ్రత, భద్రత, తాగునీరు, విద్యుత్, శౌచాలయాలు తదితర సౌకర్యాలు, అలాగే ఆధ్యాత్మిక వాతావరణం నిలుపుకునేలా తీసుకోవాల్సిన చర్యలపై కూడా అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ పవిత్ర జాతరను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఊకె వీరయ్య ఆలయ చైర్మన్, గుడి పూజారి పర్శిక రాజమ్మ, సర్పంచ్ మడకంకృష్ణ, ఉప సర్పంచ్ మహేష్, ఆలయ కమిటీ మెంబర్లు, ఫారెస్ట్ అధికారి ముజాయిద్దీన్, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, మాజీ చైర్మన్ పోతిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, కూనవరం ఉపసర్పంచ్ మనోజ్ సింగారం వార్డు మెంబర్, శ్వేతన్ ,మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వాడబలిజ సేవా సంఘం యూత్ అధ్యక్షుడు బొల్లె ఆదినారాయణకు ఘన సన్మానం

**వాజేడు,జనవరి 14,(డిడి9 వార్త)**
వాజేడు మండలం ధర్మవరం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర వాడబలిజ సేవా సంఘం యూత్ అధ్యక్షుడిగా ఎన్నికైన బొల్లె ఆదినారాయణను బుధవారం ధర్మారం గ్రామస్తులు, పెద్దలు, యువకులు ఘనంగా సన్మానించారు అలాగే నూతనంగా ఉప సర్పంచ్‌గా ఎన్నికైన సూర్యంను అన్ని విధాల సహకారం అందిస్తున్న అల్లి సూరిబాబు ని,సంఘ కోశాధికారి సురేష్ను కూడా ఈ సందర్భంగా ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా బొల్లె ఆదినారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘ నాయకులకు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. యూత్ అధ్యక్షుడిగా యువతను సంఘటితం చేసి, విద్య, ఉపాధి, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా వాడబలిజ సేవా సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. గ్రామాభివృద్ధి, యువత సంక్షేమం కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని, సంఘ కార్యక్రమాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర వాడబలిజ సేవా సంఘం ఉపాధ్యక్షులు గగ్గూరి రమణయ్య, వాజేడు మండల అధ్యక్షులు నాగార్జున, దేవా శ్రీరాములు, ఉపాధ్యక్షులు తోనూరి రఘుబాబు పాల్గొన్నారు. అలాగే మహేష్, నరేష్, నవీన్, అశోక్, సాయి, లక్ష్మణ్, శివకృష్ణ, కార్తీక్ తదితర వాడబలిజ యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# కుటుంబ సభ్యుల పరామర్శ

**పెద్దపెల్లి జిల్లా, జనవరి 14 (డిడి 9 వార్తా)**
పెద్దపల్లి జిల్లా రామగుండం లింగాపూర్ లో గత కొద్దిరోజులుగా క్రితం చనిపోయిన కుటుంబాలను పరామర్శించిన బి.ఆర్.ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్ లింగాపూర్ లో ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడిన కీర్తిశేషులు కందుల తిరుపతి స్రవంతి దంపతుల కుటుంబాన్ని, అలాగే ఆత్మహత్యకు పాల్పడిన కీర్తిశేషులు ఆడెపు శ్రీకాంత్ కుటుంబాన్ని, యాక్సిడెంట్లో మరణించిన సిరిపురం అఖిల్ కుటుంబాన్ని, కీర్తిశేషులు నగనూరి లక్ష్మి కుటుంబాన్ని, బిజెపి నాయకులు కందుల పోచం సంధ్యారాణి కుటుంబాన్ని, జాపతి ప్రభాకర్, శ్రీనివాస్ వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి మాజీ ఎం ఎల్ ఎ కోరుకంటి చందర్ ధైర్యాన్ని చెప్పారు .ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నారాయణదాసు మారుతి, పట్టణ అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్, మాజీ ప్రజా ప్రతినిధులు ఆర్షనపల్లి శ్రీనివాస్,నిమ్మరాజుల సాగర్, సీనియర్ నాయకులు, కందుల సత్తయ్య, ఆర్షణపల్లి రాజు, నిమ్మరాజుల రవి,ఆర్షన పెల్లి శ్రీకాంత్, జాపతి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

